Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 145 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 జూన్ 2023 శుక్రవారం పేజీలు : 4

## పూంఛ్‌లో ఉగ్రదాడి తర్వాత పాక్‌లో అలజడి

న్యూఢిల్లీ, ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో 20న రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ జవాన్లు ప్రయాణిస్తున్న ట్రక్కుపై లష్కర్ ఎ తొయిబా అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ-ఫాసిస్ట్ ఫ్రంట్ దాడి జరిపిన నాటి నుంచి పాకిస్థాన్ భయంతో వ ణికిపోతోం ది. భారత్ మరోసారి సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. ఇప్పటికే భారత్ తమ గగనతలంలోకి జొచ్చుకువచ్చిందని పాక్ సైన్యం వెల్లడించింది. పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో జరపకపోవచ్చని భారత్‌లో పాక్ మాజీ హై కమిషనర్ అబ్దుల్ బాసిత్ చెప్పారు. ఓ పక్క షాంఘై సహకార సంస్థకు, మరో పక్క జీ20 దేశాలకు భారత్ ప్రస్తుతం అధ్యక్షత వహిస్తున్న తరుణంలో పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు జరపకపోవచ్చని బాసిత్ అంచనా వేస్తున్నారు.

## కులాల వారీగా భూ కేటాయింపులా?.. హైటెక్ రాష్ట్రంలో ఇదేం విధానం: హైకోర్టు



హైదరాబాద్: వెలమ, కమ్మ సంఘాలకు భూ కేటాయింపులపై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేయూ విశ్రాంత ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. 2021లో ఖానామెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కమ్మ, వెలమ సంఘాలకు 5 ఎకరాల చొప్పున కేటాయించిందని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. కులాల వారీగా భూములు కేటాయించడమేంటని ఉన్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కులాల వారీగా భూములు కుటాయించడం ఆర్టికల్ 14కి విరుద్ధమని వ్యాఖ్యానించింది. "ప్రభుత్వం తీరు సమాజంలో కుల విభజనకు దారి తీసేలా ఉంది.

21వ శతాబ్దంలో.. హైటెక్ రాష్ట్రంలో ఇదేం విధానం. కులాల వారీగా భూ కేటాయింపులు అసంబద్ధం, తప్పు" అని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాలకు మాత్రమే భూములు ఇవ్వాలని, కులాంతర వివాహాలను ప్రోత్సహించడం వంటి విధానాలు ఉండాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇరుకైన ఆలోచనలు వీడి.. విశాలంగా ఆలోచించాలని హైకోర్టు వ్యాఖ్యానించింది.

**శారదాపీఠం, జీయర్ అకాడమీకి భూముల కేటాయింపుపై విచారణ..** శారదాపీఠం, జీయర్ వేదిక్ అకాడమీకి భూముల కేటాయింపుపై హైకోర్టులో విచారణ జరిగింది. సికింద్రాబాద్‌కు చెందిన వీరాచారి వేసిన పిటిషన్లపై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.కోట్ల విలువైన భూములను ఎకరానికి రూపాయి చొప్పున ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఏజీ ప్రసాద్.. సంప్రదాయాలు, వేదాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. శారదాపీఠం, జీయర్ అకాడమీకి భూ కేటాయింపులపై కేబినెట్ నిర్ణయాల్లో తప్పేమీ లేదన్నారు. పిటిషన్లపై స్పందించాలని విశాఖ శారదాపీఠం, జీయర్ అకాడమీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విశాఖ శారద పీఠానికి భూకేటాయింపుపై విచారణ జులై 24కి, జీయర్ అకాడమీకి భూకేటాయింపుపై విచారణ ఆగస్టు 1కి వాయిదా వేసింది.

**రెడ్డి కాలేజీ సొసైటీకి భూమి కేటాయింపుపై..** రెడ్డి కాలేజీ సొసైటీకి బద్వేల్‌లో భూమి కేటాయింపుపై సామాజిక కార్యకర్తలు రాజేశ్వరరావు, విజయ్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. రూపాయికి ఎకరం చొప్పున 5 ఎకరాలు కేటాయించడం రాజ్యాంగవిరుద్ధమని పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2018లో భూమి కేటాయిస్తే అయిదేళ్ల తర్వాత పిల్ ఎందుకు వేశారని హైకోర్టు ప్రశ్నించింది. జీవోను ప్రభుత్వం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తెలిపారు. పిల్ వేయడంలో జాప్యానికి కారణాలు, భూమి ప్రస్తుతం ఏ దశలో ఉందో అఫిడవిట్ వేయాలని పిటిషనర్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు జూన్ 23కి వాయిదా వేసింది.

**దర్శకుడు శంకర్‌కు భూ కేటాయింపుపై..** దర్శకుడు ఎన్.శంకర్‌కు మోకిలలో 5 ఎకరాల కేటాయింపుపై కరీంనగర్‌కు చెందిన జె.శంకర్ వేసిన పిటిషన్‌పై మరోసారి విచారణ జరిగింది. రూ.కోట్ల విలువైన భూమిని ఎకరం రూ.5లక్షలకే కేటాయించారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఎఫ్‌డీసీ సిఫార్సు మేరకు రాయితీ ధరతో కేటాయించే అధికారం కేబినెట్‌కు ఉందని ఏజీ వివరించారు. సినీ స్టూడియో నిర్మాణం కోసం ఎన్.శంకర్‌కు భూమి కేటాయించినట్టు తెలిపారు.

ఉమ్మడి ఏపీలో పలు సినీ స్టూడియోలకు భూములు కేటాయించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. భూమి కేటాయింపులో ఎలాంటి పక్షపాతం, నిబంధనల ఉల్లంఘన లేదని శంకర్ తరఫు న్యాయవాది తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత స్థానికులను ప్రోత్సహించాలన్న విధానంలో భాగంగానే కేటాయించారన్నారు. భూ కేటాయింపులపై 2007 తర్వాత చట్టాలు మారాయని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు జులై 5కి వాయిదా వేసింది.

## సిద్దిపేటలో టీ హబ్ ఏర్పాటు చేస్తాం : మంత్రి కేటీఆర్




సిద్దిపేట : ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీని విస్తరించి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న రాష్ట్ర ప్రభుత్వం.. అనేక జిల్లా కేంద్రాల్లో సకల వసతులతో ఐటీ టవర్లను నిర్మించి కంపెనీలను ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సిద్దిపేట పట్టణ శివారులోని నాగులబండ వద్ద రాజీవ్ రహదారిని ఆనుకొని నిర్మించిన ఐటీ టవర్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు.. ఐటీ మినిస్టర్ కేటీఆర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. కలలోనైనా సిద్దిపేటకు ఐటీ హబ్ వస్తుందని అనుకున్నామా..? రాష్ట్రమే రాకపోతే సిద్దిపేట జిల్లా అయ్యేదా..? సిద్దిపేటకు సీఎం కేసీఆర్ బలమైన పునాది వేశారు. తెలంగాణకు ఆయువుపట్టు సిద్దిపేట గడ్డ. ఐటీ టవర్ ప్రారంభంతో సిద్దిపేటలో 1500 మందికి ఉపాధి వచ్చింది. సిద్దిపేటకు పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాం. ఐటీ టవర్ ప్రారంభం రోజునే సంస్థలు వచ్చి ఉద్యోగాలు ఇవ్వడం చాలా గొప్ప పరిణామం. ఐటీ హబ్‌కు మరిన్ని నిధులు మంజూరు చేసి విస్తరిస్తాం. సిద్దిపేటలో టీ హబ్ ఏర్పాటు చేస్తాం. 2014లో రాష్ట్రం ఏర్పడిన నాడు రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు కేవలం రూ. 56 వేల కోట్లు మాత్రమే. ఇవాళ రూ. 2.41 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులకు చేరుకున్నామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ మోడల్ అంటే సమగ్ర, సమ్మిళిత, సమీకృత, సమతుల్య అభివృద్ధి అని కేటీఆర్ పేర్కొన్నారు.

3 శాతం గ్రామీణ జనాభా ఉన్న తెలంగాణ దేశంలో 30 శాతం అవార్డులు సాధిస్తున్నాయి. హరితహారం ద్వారా రాష్ట్రంలో పచ్చదనాన్ని 7.7 శాతానికి పెంచాం. మిషన్ భగీరథకు పునాది పడిన గడ్డ సిద్దిపేట అని కేటీఆర్ తెలిపారు. 3 ఎకరాల సువిశాల స్థలంలో రూ.63 కోట్లతో జీప్లస్ 4 అంతస్థుల్లో ఐటీ టవర్‌ను నిర్మించారు. ఈ టవర్ నిర్మాణ పనులకు సీఎం కేసీఆర్ 2020 డిసెంబర్ 10న శంకు స్థాపన చేశారు. అదేరోజు వివిధ కంపెనీలతో ఒప్పందాలపై ఐటీ శాఖ కార్యదర్శి సంతకాలు చేశారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రముఖ ఐటీ కంపెనీలు పోటీ పడుతున్నాయి. మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చారు. ఓఎస్ఐ డిజిటల్ (244 ఉద్యోగాలు ), ఫిక్సిటీ టెక్నాలజీస్ (100), అమిడాయ్ ఎడ్యుటెక్ (80), జోలాన్ టెక్ (25), విజన్ ఇన్ఫో టెక్ (25), థోరాన్ టెక్నాలజీస్ (25), బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్ (03), ర్యాంక్ ఐటీ సర్వీసెస్ (25), కామ్‌సీఎక్స్ ఐటీ (25), ఎంఎస్‌పీఆర్ (25) అమృత సిస్టమ్ (25) ఇన్ఫోసోల్ (25) ఉద్యోగాలు కల్పించాయి. తొలుత 718 మందిని కంపెనీలు ఎంపిక చేసుకొన్నాయి. ఐటీ టవర్ ప్రారంభించిన మరు నిమిషం నుంచే వీరంతా పనిచేసేలా వసతులు కల్పించారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందినవారికి టాస్ ద్వారా శిక్షణ అందిస్తారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో భాగస్వామ్యం అయ్యేందుకు వచ్చిన కంపెనీలకు రెండేండ్లపాటు ఉచితంగా నిర్వహణ, అద్దె, విద్యుత్తు, ఇంటర్నెట్ బిల్లులు భారం లేకుండా చూస్తామని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.

## నాలుగో జాతీయ జల అవార్డుల్లో రాష్ట్రానికి మూడు పురస్కారాలు

హైదరాబాద్: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వ అవార్డుల పరంపర కొనసాగుతున్నది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు ఇప్పటికే పలు జాతీయ అవార్డులు అందుకోగా తాజాగా కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన నాలుగో జాతీయ జల అవార్డుల్లో రాష్ట్రానికి మూడు పురస్కారాలు లభించాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని




జగన్నాథపురం గ్రామ పంచాయతీకి జాతీయ ఉత్తమ పురస్కారం లభించగా, ఉత్తమ జిల్లా కేటగిరీలో ఆదిలాబాద్‌కు మూడో స్థానం, ఉత్తమ సంస్థల విభాగంలో ఉర్దూ వర్సిటీకి రెండో స్థానంలో నిలిచాయి. ఈనెల 17న ఢిల్లీలో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరుగనుంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్న రోజునే ఈ అవార్డు లభించడం విశేషం.

## బండి మొదలెట్టేశారు.. 20 మంది గులాబీ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారట

హైదరాబాద్ : బండి మార్క్ మాటలు మళ్లీ మొదలయ్యాయి. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ భారీగా పడిపోతుందన్న మాటలు బలంగా వినిపిస్తున్న వేళ.. ఆ వాదన తప్పన్న విషయాన్ని చాటి చెప్పేందుకు వీలుగా టీబీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రయత్నాల్ని మళ్లీ షురూ చేశారు. ఇటీవల కాలంలో కాస్తంత కామ్ గా ఉన్న ఆయన..తాజాగా ఇటీవల కాలంలో తాను మాట్లాడని లోటును తీర్చేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమతో 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని చెప్పారు. బండి నోటి నుంచి ఈ వ్యాఖ్యలు రావటానికి రోజు ముందు.. మంత్రి కేటీఆర్ ప్రగతిభవన్ లో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లలో భేటీ కావటం.. ఆ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు టచ్ లో ఉన్నారని.. మీతో ఎవరైనా ఉంటే.. టచ్ లోకి వెళ్లమని చెప్పటం తెలిసిందే. పార్టీ మారాలనుకునే వారికి ఇదే సరైన సమయమన్న కేటీఆర్ మాటలకు కౌంటర్ ఇచ్చేలా రిటార్టు ఇచ్చేలా బండి తాజా వ్యాఖ్యలు ఉండటం గమనార్హం. "బీజేపీలోకి రావటానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సమయం కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెంచటానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. 30మంది కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ ప్రతి నెలా డబ్బులు ఇస్తున్నాడు. కాంగ్రెస్ కు స్పాన్సర్ గా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ కానుందన్న ఆయన.. ఉప ఎన్నికల్లో



డిపాజిట్ రాని కాంగ్రెస్ బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. "జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు సీట్లు మాత్రమే వచ్చాయి" అని గుర్తు చేశారు. బండి సంజయ్ హిందువులు గురించి బరాబర్ మట్లాడుతాడన్న ఆయన.. బీజేపీ వల్లే కాంగ్రెస్ బీఆర్ఎస్ కమ్యూనిస్టులు భాగ్యలక్ష్మీ దేవాలయం బాట పట్టారన్నారు. "కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీజేపీ వలనే సైతం భాగ్యలక్ష్మీ దేవాలయానికి వెళ్లారు. నిజామాబాద్ కరీంనగర్ వరంగల్ కార్పరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఔట్ అయింది. మోదీ తొమ్మిదేళ్ళ పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే బీజేపీ కార్యాలయాలు" అని పేర్కొన్నారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలన్న బండి..కేసీఆర్ కుటుంబ సభ్యులు సహా.. అవినీతికి పాల్పడిన వారు జైలు వెళ్లటం ఖాయమన్నారు. "అవినీతిపరులను మోదీ ప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అవినీతిపరులను జైలుకు పంపటం లేదని ప్రజలు మీడియా పదే పదే అడుగుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా.. అవినీతిపరులు జైలుకు పోవటం ఖాయం" అని వ్యాఖ్యానించారు. ధరణితో పేద ప్రజలు నాశనం అవుతున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. 'ధరణి పేదల పాలిట శాపం. ధరణి పోర్టల్ కి రైతుబంధుకు సంబంధం ఏంటో కేసీఆర్ చెప్పాలి" అని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య వైద్యం అందిస్తామన్నారు. పేద పిల్లను చదివించే బాధ్యతను బీజేపీ తీసుకుంటోందని చెప్పారు. ఇదంతా బాగానే ఉన్నా.. 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నప్పుడు వారిలో ఒక్కరైనా ఎప్పుడు బయటకు వస్తారు? అన్న ప్రశ్నకు బండి బదులు ఇవ్వగలరా?

# పల్లె ప్రగతితో తెలంగాణ అగ్రపథం

## అవార్డులే అవార్డులు..!!



హైదరాబాద్ : గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె ప్రగతి కార్యాక్రమానికి అంకురార్పణ చేసారు. ఈ నిర్ణయంతో పల్లెల రూపు రేఖలే మారిపోయాయి. ఈ కార్యక్రమం ద్వారా పల్లెల్లో మొత్తం రూ. 13,528 కోట్లను ఖర్చు చేశారు. ప్రభుత్వం తెలంగాణలోని 12,769 గ్రామాలను అంటే 100 శాతం గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్ది దేశంలోనే టాప్ ర్యాంక్ ను సాధించింది. తెలంగాణ పల్లెలకు 13 జాతీయ అవార్డులు రాష్ట్రపతి చేతులమీదుగా ఆయా స్థానిక సంస్థల ప్రతినిధులు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో, సిఎం కేసిఆర్ నాయకత్వంలో, దశాబ్ది స్వీయ పాలనలో కొత్త స్వరం పురివిప్పుకుంది. "పల్లే పచ్చగా మారింది స్వయం పాలనలోనా...నా తల్లి సంబరపడుతోంది పల్లెప్రగతి పథాన" అని జానపదం పాడుకుంటోంది. ప్రతి ఊరుకు హరితహారం, నర్సరీ, డంపింగ్ యార్డు, ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు, వైకుంఠధామాలు, క్రీడా స్థలాలు, పల్లె దవాఖానాలు, మిషన్ భగీరథ నీళ్లు, 24 గంటల విద్యుత్ తో వెలుగుల వాకిళ్లుగా తెలంగాణ పల్లెలు పటిష్ఠం అయ్యాయి. గ్రామాలు స్వయం సమృద్ధితో ఎదిగాయి. దశాబ్ది ఉత్సవం వేళ కొత్త ఉత్సాహంతో నిండాయి. ఈ పథకం కింద ఖరారు చేసిన కార్యక్రమాల కోసం రూ. 13,528 కోట్లను ఖర్చు చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ ను ఏర్పాటుతోపాటు 12745 గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాలు వచ్చాయి. గతంలో మూడు నాలుగు గ్రామాలకు కలిపి ఒక కార్యదర్శి ఉంటే గొప్ప. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించింది. ప్రభుత్వం తెలంగాణలోని 12,769 గ్రామాలను అంటే 100 శాతం గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్ది దేశంలోనే టాప్ ర్యాంక్ ను సాధించింది. న్యూఢిల్లీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తెలంగాణ పల్లెలకు 13 జాతీయ అవార్డులు రాష్ట్రపతి చేతులమీదుగా ఆయా స్థానిక సంస్థల ప్రతినిధులు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 20 వేల మంది వీఆర్ఏలతోపాటు, 9355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ప్రక్రియ కొనసాగుతున్నది. 2022-23లో ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.256 కోట్లు స్థానిక సంస్థలకు విడుదల చేసింది. పల్లె దవాఖానాలతో గ్రామంలో ఆరోగ్యం పదిలం కావడానికి ఒక్కో పల్లె దవాఖానకు రూ. 20 లక్షల వ్యయంతో పక్కా భవనాలు నిర్మిస్తున్నది. %=వషీవీఎ-ఎవఅనవవ ఎఱనవశీ% అమిత్ షా రాకపోవడానికి అసలు కారణం అదేనా.. ప్రతి భవనంలో మూడు బెడ్లతో కూడిన వార్డు రూం, ఒక వెయిటింగ్ హాల్, స్టోరేజీ గది, ఒక నర్సింగ్ గది, ల్యాబ్, రెండు మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తుంది. రోగులను వీల్‌చైర్‌లో తరలించేందుకు ర్యాంప్ కూడా నిర్మిస్తుంది. మిషన్ భగీరథ నీటితో పల్లెటూళ్లు స్వచ్ఛమైన తాగునీటి ఆవాసాలుగా మారాయి. హైదరాబాద్ మహానగరంతోపాటు, శివారు ప్రాంతాలకూ ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. నీ కన్నా పెద్ద మొగోడిని- మక్కెలిరిగిపోతాయ్: పవన్‌కు చెప్పులు చూపించిన పేర్ని నాని రూ.506 కోట్లతో మెరుగైన విద్యుత్ పంపిణి నెట్‌వర్క్ పునరుద్దరణ ద్వారా తెలంగాణ పల్లెలు వెలుగుల వాకిల్లుగా మారాయి. కేంద్రం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ 2021-22 జాతీయ పంచాయతీ అవార్డులను ప్రకటించింది. మొత్తం 46 అవార్డుల్లో 13 తెలంగాణకు దక్కాయి. ఇప్పటి వరకు దాదాపుగా 80కి పైగా అవార్డులు రాష్ట్రం సొంతం అయ్యాయి. తెలంగాణకు వచ్చిన అవార్డుల్లో స్వచ్ఛ సుందర్ శౌచాలయ్ 2019 లో తెలంగాణ - రెండో స్థానం (రాష్ట్రాల క్యాటగిరీ) పెద్దపల్లి జిల్లా తొలి స్థానం (జిల్లాల క్యాటగిరీ)కి దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2019 కింద తెలంగాణ - రెండో స్థానం (రాష్ట్రాల క్యాటగిరీ)లో నిలిచింది. గందగీ ముక్త్ భారత్ 2020 కింద తెలంగాణ తొలి స్థానం (రాష్ట్రాల క్యాటగిరీ)లో దక్కించుకుంది. కరీంనగర్ జిల్లా - మూడో స్థానం (జిల్లాల కేటగిరీ )సిద్దిపేట జిల్లా - ఉత్తమ ప్రదర్శన జిల్లాగా దక్కించుకుంది. మోదీకి మాజీ ప్రధాని అండ, నమో విద్యానిధి స్కాలర్ షిప్ లు, సోనియా గాంధీకి చెక్ ! ఈ-పురస్కార్ అవార్డు 2021:తెలంగాణ తొలి స్థానం (క్యాటగిరీ-2) దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సశక్తి కరణ్ అవార్డు-2021 దక్కింది.

పల్లె ప్రగతితో గ్రామీణ జీవన ప్రమాణాలు పెరిగాయి. పొట్ట కూటికోసం వలస వెళ్లిన పల్లెజీవులు సొంతూరుకు వచ్చి సంతోషంగా పనిచేసుకుంటున్నరు. స్వచ్ఛమైన తాగునీటితో, నిండిన చెరువులతో, కాళేశ్వరం సాగునీటితో, పచ్చని పంట పొలాలతో, పరిశుభ్రత వాతావరణంతో పల్లె మళ్లీ వికసించింది. దశాబ్ది ఉత్సవాలను దర్జాగా నిర్వహించుకుంటుంది.

# సంపాదకీయం

## అమెరికా టూర్ లో మోడీకి స్పెషల్ విందు సరే.. దేశ ప్రజలకేంటి?

ప్రపంచానికి పెద్దన్న అమెరికాలో పర్యటనకు వెళుతున్నారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ. ఇంటి పెద్ద ఊరికి వెళుతున్నప్పుడు.. ఇంట్లోని వారు.. తమకు ఏమేం తెస్తారన్న ఆశతో ఉంటారు. అలానే.. దేశ ప్రధాని అమెరికా పర్యటనకు వెళుతున్న నేపథ్యంలో.. తిరిగి వచ్చేటప్పుడు ఆయన దేశ ప్రజలకు ఎలాంటి హామీల్ని మోసుకు రానున్నారు? అన్నదిప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. ప్రధాని మోడీ కోసం స్పెషల్ పార్టీని అరేంజ్ చేస్తున్నారు. జూన్ 22న వైట్ హౌస్ లో మోడీకి అధికారిక విందును ఇవ్వనున్నప్పటికీ.. దానికి ఒక రోజు ముందు అంటే జూన్ 21న బైడెన్ కుటుంబం ప్రధాని మోడీకి ప్రత్యేక విందును ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఈ విందులో బైడెన్ కుటుంబం ప్రత్యేకంగా మోడీని కలుస్తుందని చెబుతున్నారు. దీనికి సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా ఒక అధికారి వెల్లడించారు. అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ అధికారిక విందును వైట్ హౌస్ లోని సౌత్ లాన్ లో ఇస్తున్నారు. ఈ సందర్భంగా మోడీకి స్వాగతం పలికేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఈ అధికారిక విందుకు ఒక రోజు ముందే.. అమెరికా అధ్యక్ష కుటుంబం ప్రధాని మోడీని ప్రత్యేకంగా కలుస్తూ.. విందును ఇస్తున్నారు. ఇరువురు నేతల మధ్య ఉన్న స్నేహానికి ఇదో నిదర్శనమని చెబుతున్నారు. నిజమే.. ప్రపంచ దేశాల్లో మోడీ రాక్ స్టార్. ఆయన ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తారు. చక్కటి స్నేహితుడి పాత్రలో ఒదిగిపోతారు. అమెరికా అధ్యక్ష కుటుంబంతో ప్రత్యేక విందుకు వెళుతున్న ప్రధాని మోడీ.. తనకు మాత్రమే కాదు.. తన దేశ ప్రజలకు సైతం పెద్దన్న నుంచి ప్రత్యేక వరాల్ని తీసుకొస్తే బాగుంటుందన్న మాట వినిపిస్తోంది. నిజానికి అమెరికా అనుకోవాలే కానీ.. భారత్ కు వరాలు ఇచ్చేందుకు బోలెడన్ని మార్గాలు ఉన్నాయి. వాటికి భిన్నంగా తమ వ్యాపారానికి అనువుగా మోడీ టూర్ ను వాడుకోకుండా.. భారతీయులకు మేలు కలిగే వరాల్ని ఇస్తే మరింత బాగుంటుందన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

# ఇంకెప్పుడిస్తారు?



సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ కళాశాలల్లో చదివే వారిలో ఎక్కువ మంది పేద విద్యార్థులే ఉంటారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల భారం భరించే స్తోమత లేకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలే చేయరు. పాఠ్య పుస్తకాలూ.. ఇక్కడ ఉచితం. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే తరగతులు ప్రారంభమైనా పుస్తకాలు అందలేదు. అధ్యాపకులు పాఠం చెబుతుండగా చేతిలో పాఠ్య పుస్తకం లేక విద్యార్థులు వినేందుకే పరిమితం కావాల్సి వస్తోంది. ఉచితంగా పుస్తకాలు ఇస్తున్నామని చెబుతున్నా..సకాలంలో ఇవ్వకపోవడంపై విద్యార్థుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. పుస్తకాలు అందక ఇంటర్ ద్వితీయతోపాటు ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కథనం.

35వేలకు పైగా కావాలి: జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 3,486 మంది ఉన్నారు. వీరికి జూన్ 15 నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులు ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఇప్పటి వరకు పుస్తకాలు అందలేదు. ప్రథమ సంవత్సరం ప్రవేశాలు సైతం కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 2,700 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరారు. ఈనెల 1 నుంచి వీరికీ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కూడా పుస్తకాలు అందాల్సి ఉంది. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కలిపి 35వేల పుస్తకాలు సరఫరా కావాల్సి ఉంది.

ఏటా ఇదే తీరు..: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాల సరఫరా విషయంలో ప్రతి సంవత్సరం జాప్యం జరుగుతోంది. ద్వితీయ సంవత్సరం తరగతులు ముందుగా ప్రారంభమవుతున్నా వారికి పుస్తకాల పంపిణీకి అధికారులు సరైన కార్యాచరణ రూపొందించడం లేదు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు మొదలైనా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇప్పటివరకు పుస్తకాలు పంపిణీ ఊసేలేదు. దీంతో కళాశాలలో చదివిన సీనియర్ విద్యార్థుల నుంచి పాత పుస్తకాలు సేకరించి నెట్టుకొస్తున్న వారు కొందరైతే మిగతా వారికి ఇబ్బందులు తప్పడం లేదు. తరగతి గదిలో అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలు ఇంటికి వెళ్లి చదువుకోవడానికి, అర్థం చేసుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. పాఠశాల విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు చేరవేసే ప్రక్రియ ప్రారంభించే అధికారులు జూనియర్ కళాశాల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. పుస్తకాలు సకాలంలో అందించకపోతే తాము ఎలా చదవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనే పుస్తకాలను కళాశాలలకు సరఫరా చేస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

జిల్లాకు చేరగానే పంపిణీ చేస్తాం..-గోవిందరామ్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

పాఠ్య పుస్తకాలు కళాశాలలకు చేరని మాట వాస్తవమే. జిల్లాకు సరఫరా కాగానే కళాశాలలకు చేరవేస్తాం. తరగతులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో ఇంటర్ పూర్తయిన విద్యార్థుల నుంచి సేకరించిన పాత పుస్తకాలు ఉంటే అప్పటి వరకు సర్దుబాటు చేయాలని సూచించాం. కొత్త పుస్తకాలు త్వరలో వస్తాయి.

# అందని బిల్లులు.. చెరకు రైతుల ఇక్కట్లు



జహీరాబాద్ : చెరకు బిల్లుల కోసం ఈ ఏడాదీ జిల్లాలోని రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గత గానుగ సీజన్ ముగిసి ఆరు నెలలయింది. మరో రెండు నెలల్లో కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఇంత వరకు గత సీజన్‌కు సంబంధించిన పూర్తి బిల్లులు అందక పోవటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే కర్మాగారం యాజమానులతో అధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు చర్చలు జరిపినా ఇంకా సమస్య పరిష్కారం కాలేదు. ట్రైడెంట్ పరిధిలో గత సీజన్‌కు సంబంధించిన బిల్లులు దాదాపు రూ.4 కోట్ల పైచిలుకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కథనం.

ఏటా ఇదే తీరు..జిల్లా చెరకు రైతులు పంటను జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ కర్మాగారం, సంగారెడ్డి సమీపంలోని గణపతి, కామారెడ్డి జిల్లాలోని మాగి కర్మాగారానికి తరలించి విక్రయిస్తారు. చక్కెర శాఖ నిబంధనల ప్రకారం రైతులు కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన 15 రోజుల్లో బిల్లులు అంధించాలి. సీజన్ ముగిసి నాలుగైదు నెలలు దాటినా బిల్లులు అందక అనేక మంది రైతులు దిక్కుతోచని పరిస్థితిల్లో ఉన్నారు. గానుగ ప్రారంభంలో రెండు, మూడు నెలల పాటు సాఫీగా బిల్లులు చెల్లిస్తున్న యాజమాన్యాలు, చివరి సమయంలో చేతులెత్తేయడంతో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు విసిగిపోతున్నారు. 2021-22 గానుగ (గత) సీజన్‌కు సంబంధించి ట్రైడెంట్ కర్మాగారం రూ.72 లక్షలు, కామారెడ్డి జిల్లాలోని మాగి కర్మాగారం రూ.3.43కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. మాగి కర్మాగారం బకాయిల వల్ల నారాయణఖేడ్ ప్రాంతంలోని రైతులు, ట్రైడెంట్ కర్మాగారం బకాయిల వల్ల జహీరాబాద్ ప్రాంతంలోని కర్షకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా చక్కెర మిల్లులు అక్టోబరు-నవంబరులో గానుగను ప్రారంభించి, మార్చి-ఏప్రిల్‌లో ముగిస్తుంటారు.

పెట్టుబడికి అవస్థలు

మిగితా పంటలన్నీ ఏడాదికి రెండు, మూడు సార్లు ఉత్పత్తులను తీసుకోవచ్చు. చెరకు పంట మాత్రం ఏడాదికి ఒకేసారి వస్తున్నందున రైతులు రేయింబవళ్లు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలోని అత్యధిక మంది రైతులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, పిల్లల వివాహాలు, ఇతర శుభకార్యాలు, ఇతర అవసరాలను చెరకు పంటద్వారా తీర్చుకుంటారు. సకాలంలో బిల్లులు చేతికి అందక వారికి అవస్థలు తప్పడం లేదు. పాత అప్పులు తీర్చలేక, కొత్త అప్పులు పుట్టక పంట పెట్టుబడికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో బిల్లులు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.


చెల్లింపులకు ఏర్పాట్లు చేస్తున్నాం..- రాజశేఖర్, చక్కెర శాఖ జిల్లా సహాయ కమిషనర్

రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై పలుమార్లు యాజమాన్యాలతో చర్చలు జరిపాం. బిల్లుల చెల్లింపులో జాప్యం చేసిన కర్మాగారాలకు ఇప్పటికే తాఖీదులు జారిచేశాం. దీనిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుంది.

# కొసరు పనులు.. కొండంత దిగులు..!

సిద్దిపేట : పేదల సొంతింటి కల.. ఒక అడుగు దూరంలో అన్న చందంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. జిల్లాలో 213 ప్రాంతాల్లో దశల వారీగా 15,826 గృహాలను నిర్మించాలని నిర్ణయించారు. 7,431 నిర్మాణాలు పూర్తికాగా 4,403 ఇళ్లకు సంబంధించి ప్రవేశాలు పూర్తయ్యాయి. శ్రావణ మాసం కావడంతో పెండింగ్‌లో ఉన్న వాటిని పంపిణీ చేసే క్రతువు మొదలైంది. 3,188 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. అనేక ఇళ్లు నిర్మాణం పూర్తయి సదుపాయాలు లేక ప్రారంభానికి ఎదురుచూడాల్సి వస్తోంది. మౌలిక వసతుల కల్పన కరవై జాప్యం ఏర్పడుతోంది. ఈ అంశం పేదలను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో 2,014 ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. అందులో పూర్తిస్థాయిలో సదుపాయాలు లేకపోవడం గమనార్హం. ఒక్కో ఇంటి నిర్మాణానికి పట్టణాల్లో రూ.5.30 లక్షలు, గ్రామాల్లో రూ.5.04 లక్షలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. కనీస వసతుల కల్పనలో భాగంగా నీటి సరఫరా, విద్యుత్తు, మురుగుపారుదల వ్యవస్థ, సీసీ దారులు, ఇతరత్రా వాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.1.25 లక్షలు, పట్టణాల్లో రూ.75 వేలు ఖర్చు పెడుతున్నారు.

దృష్టి పెడితే పరిష్కారం..జిల్లాలో అనేక చోట్ల చిన్నపాటి వసతుల కల్పిస్తే ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా ప్రభుత్వ లక్ష్య నెరవేరనుంది. అందుకు విరుద్ధంగా వివిధ కారణాలతో పంపిణీకి జాప్యం ఏర్పడుతోంది. విద్యుత్తు తీగలు, స్తంభాలు బిగింపు లేక.. వీధి దీపాలు అమరిక కరవై, అంతర్గత రహదారులు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, తాగునీరు, రోజువారీ వినియోగానికి నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. అవి వివిధ దశల్లో నెమ్మదిగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదు. పలుచోట్ల గుత్తేదారులకు సకాలంలో చెల్లింపులు కరవై జాప్యానికి కారణమవుతోంది. కొన్ని చోట్ల కార్మికుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా వసతులు కల్పించి గృహ ప్రవేశాలకు మోక్షం కల్పించాలని పేదలు కోరుతున్నారు.



హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి 40 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు అయ్యాయి. తగిన స్థలం లేకపోవడంతో 32 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వాటికి రంగులు వేయడం కూడా పూర్తయింది. ఆరు నెలలు గడుస్తోంది. ఇక్కడ సీసీ రహదారులు, సెప్టిక్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఇటీవల జిల్లా పాలనాధికారి.. హుస్నాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

దుబ్బాక పట్టణంలో మొత్తం 792 ఇళ్లను 66 బ్లాక్‌లుగా విభజించి నిర్మించారు. ఏడాది కిందటే నిర్మాణాలు పూరయ్యాయి. మౌలిక వసతులు కల్పించకపోవడంతో పూర్తిస్థాయిలో గృహ ప్రవేశాలకు నోచుకోవడం లేదు. గత జూన్‌లో 180, జులై 130 ఇళ్లకు ప్రవేశాలు ఆదరాబాదరగా జరిగాయి. ఇప్పటికీ డ్రైనేజీ నిర్మాణం పూర్తి కాలేదు. కొన్ని బ్లాక్‌లలో మిషన్ భగీరథ నీరు సరఫరా లేదు. మరికొన్ని ఇళ్లలో విద్యుత్తు వ్యవస్థను సిద్ధం చేయాల్సి ఉంది. మొత్తంగా 482 ఇళ్ల పనులు పూర్తయినా వసతుల కల్పనలో జాప్యం జరుగుతోంది.

తగిన చర్యలు తీసుకుంటాం..

తొలుత సిద్ధంగా ఉన్న ఇళ్లను పంపిణీ చేసే అంశంపై దృష్టి సారించాం. ఇదే క్రమంలో నిర్మాణం పూర్తయి.. మౌలిక వసతులు లేని వాటిపై దృష్టి సారించి పూర్తయ్యేలా చూస్తాం. పల్లెలు, పట్టణాల్లో స్థానిక సంస్థల నిధులను వినియోగిస్తాం. త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటాం.- ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా పాలనాధికారి

# సమీకృత విపణి.. పూర్తయ్యేదెప్పుడని!

పెద్దపల్లి: జిల్లాలో దేశీయ గొర్రెల విపణి ఇప్పట్లో అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు. నిధులున్నాయి.. నిర్మించేందుకు స్థలం ఉంది.. మార్కెట్ నిర్వహణకు అనుకూలతలున్నాయి.. అయినా ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవ లేక రెండేళ్లుగా పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. అంతర్గాం మండలం కుందన్‌పల్లిలో సమీకృత గొర్రెల, మేకల మార్కెట్‌కు 2020 సెప్టెంబరు 20న పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. 4.5 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మార్కెట్ నిర్మాణం పనులను గతేడాది నవంబరులో రామగుండానికి చెందిన ఓ గుత్తేదారు టెండరులో దక్కించుకున్నాడు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తానని ఒప్పందం కూడా కుదుర్చుకున్నాడు. ఇప్పటివరకు కేవలం స్థలం చుట్టూ ఇనుప కంచె నిర్మాణం తప్ప పునాదులు తవ్వలేదు, ఇటుకలు పేర్చలేదు. పైగా మార్కెట్ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా కుందనపల్లి రైల్వే విద్యుద్దీకరణ పనుల సామగ్రిని, కూలీల గుడిసెలను ఏర్పాటు చేశారు. కాగా వర్షాల కారణంగానే సమీకృత విపణి పనులు చేపట్టడం లేదని అధికారులు చెబుతున్నారు.

వంతెన కిందనే జీవాల విక్రయం

జిల్లాలో గొర్రెలు, మేకల విక్రయాలకు ప్రత్యేక విపణి లేకపోవడంతో పెద్దపల్లి పట్టణ శివారులోని మంథని వంతెన కింద, వివిధ మండలాల్లోని ప్రధాన కూడళ్లలో విక్రయాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట శంకుస్థాపన చేయగా, త్వరితగతిన పనులు చేస్తే ఇప్పటికే విపణి అందుబాటులోకి వచ్చేది. నిధులు మంజూరైనా పనుల్లో జాప్యంపై పెంపకందారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయితీపై గొర్రెల పంపిణీ పథకం కింద జిల్లాలో 2017 జూన్ 20న మొదటి విడతలో 197 సంఘాల పరిధిలోని 21,110 మంది సభ్యులను గుర్తించారు. వరుసగా రెండేళ్లు లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు మంజూరు చేశారు. 2017-18లో 5,110 యూనిట్లు, 2018-19లో 5,113 యూనిట్లు కలిపి మొత్తం 10,223 యూనిట్లను 10,600 మందికి పంపిణీ చేశారు. 2019-20 ఎన్నికలు, కరోనా కారణంగా పంపిణీ చేయలేదు. ఒక్కో లబ్ధిదారుకు 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇస్తూ యూనిట్ వ్యయం రూ.1.25 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో రూ.31,250లను లబ్ధిదారు, రూ.93,750లను ప్రభుత్వం రాయితీ వాటాగా చెల్లించింది. మొత్తం 2,14,683 గొర్రెలను పంపిణీ చేయగా, ప్రస్తుతం 5,70,000 సంతతి అభివృద్ధి చెందినట్లు అధికారులు చెబుతున్నారు.

నమూనా మార్కెట్ల ఏర్పాటు కలేనా!

సాక్షాత్తూ మంత్రులు శంకుస్థాపన చేసిన విపణి పనుల్లోనే జాప్యం జరుగుతుండగా, గతంలో మండలానికి ఒక నమూనా గొర్రెల మార్కెట్ అంటూ నేతలు ఇచ్చిన హామీలు అలాగే ఉండిపోయాయి. జిల్లాలో మొత్తం 197 గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాలుండగా, అందులో రామగుండంలోని అంతర్గాం, పాలకుర్తి మండలాలకు సంబంధించి 26 సంఘాలున్నాయి. ప్రస్తుతం కుందనపల్లిలో ఏర్పాటయ్యే మార్కెట్‌లో ఈ రెండు మండలాల నుంచి మాత్రమే ఎక్కువ సంఖ్యలో జీవాలను విక్రయించే వీలుంటుంది. మిగిలిన 12 మండలాల నుంచి ఇక్కడికి తేవాలంటే రవాణా, నిర్వహణ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కాని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో కుందనపల్లితో పాటు రెండు మండలాలకు ఒక మార్కెట్ చొప్పున మరో 6 నమూనా విపణులను ఏర్పాటు చేయాలని అధికారులు, సంఘాల సభ్యులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఎలిగేడు, సుల్తానాబాద్, ధర్మారం, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ, నిర్వహణ ఏర్పాట్లపై శాఖాపరంగా కార్యాచరణ చేపట్టారు. కాగా వీటి నిర్వహణను గుత్తేదారులకు అప్పగించకుండా సొసైటీ సభ్యులకు అప్పగిస్తే ఆర్థికాభివృద్ధి, స్వయం సమృద్ధిగా సాధించే వీలుంటుందని గొర్రెలు, మేకల పెంపకందారులు అభిప్రాయపడుతున్నారు.

వానలతోనే పనులు జాప్యం – మునిరాజ్, పంచాయతీరాజ్ ఈఈ

భారీ వర్షాల కారణంగానే గుత్తేదారులు సమీకృత విపణి పనులు చేపట్టడం లేదు. ఇప్పటివరకు ఫెన్సింగ్ పనులు జరిగాయి. రెండు నెలల్లో నిర్మాణం పూర్తయ్యేలా పనులను ముమ్మరం చేస్తాం. రైల్వే పనులకు సంబంధించి నిర్మాణ సామగ్రిని విపణి స్థలంలో ఉంచడానికి గుత్తేదారులు అనుమతులు తీసుకోలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# రాగి తీగపై చోరుల కన్ను

ధర్మపురి : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల వల్ల విద్యుత్తు సంస్థ తీవ్రంగా నష్ట పోయింది. దీనికి తోడు ఆరు నెలలుగా నియంత్రికల్లోని రాగితీగ చోరీకి గురవుతుండటంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో పాటు సంస్థకు నష్టం వాటిల్లుతోంది. ఆరు నెలల వ్యవధిలో నేరెల్ల సెక్షన్ పరిధిలో పది, ధర్మపురి పరిధిలో ఏడు నియంత్రికల్లోని రాగితీగ చోరీకి గురైంది. ధర్మపురి మండలంలో మొత్తం పదిహేడు నియంత్రికలను ధ్వసం చేసి అందులోని రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. తిమ్మాపూర్ శివారులో ఏడు, రాయపట్నం శివారులో మూడు, బుద్దేశ్‌పల్లె పరిధిలో రెండు, దోనూరులో మూడు, నక్కలపేటలో ఒకటి, గాదెపల్లిలో ఒక చోట నియంత్రికను ధ్వంసం చేసి తీగను దొంగిలించారు.

సరఫరాలో అంతరాయం

దొంగలు మొదటగా నియింత్రికకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేసేందుకు బలమైన కర్రలతో ఇన్సులేటర్లను పగలగొడుతున్నారు. గద్దెలపై ఉన్న నియంత్రికను కిందకు పడేసి ధ్వంసం చేసి అందులో నుంచి రాగి తీగను చోరీ చేస్తున్నారు. దీనికి బయట విక్రయించి సొమ్ము చేసుకుంటారు. దొంగల చర్యల వల్ల ఒక్కో నియంత్రికకు సుమారు.రూ.40వేల నుంచి రూ.50వేల వరకు నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రజాధనం వృథా అవుతుండటంతో పాటు తిరిగి నియంత్రికను అమర్చి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించే వరకు విద్యుత్తు సరఫరా ఆగిపోతుంది. ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ ప్రతులను తీసుకుని నియంత్రికను తిరిగి అమర్చే వరకు వారం రోజుల సమయం పడుతుంది. దీంతో పంటలకు నీరు అందించడంలో ఇక్కటు ఎదురవుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వసం చేసి తరచుగా రాగి తీగను దొంగలిస్తుండటంతో అధికారులు ధర్మపురి పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. స్థానికుల సాయంతో దొంగలను పట్టుకునేందుకు విద్యుత్తుశాఖాధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం – సింధూర్ శర్మ, సహాయ డివిజనల్ ఇంజినీర్గ్రామస్థుల సహకారంతో దొంగలను పట్టుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. నిశితంగా గమనించమని విద్యుత్తు సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాం. దొంగతనానికి పాల్పడటం వల్ల సరఫరా నిలిచిపోవడంతో పాటు రైతులకు, సంస్థకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందికేసులు నమోదు చేశాం – కిరణ్‌కుమార్, ఎస్సై ధర్మపురి

విద్యుత్తుశాఖాధికారుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేశాం. నియంత్రికల్లోని రాగితీగ చోరీపై దృష్టి సారించాం. చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకుంటాం. గ్రామస్థులు సైతం అప్రమత్తంగా వ్యవహరించి సమాచారం అందించాలి.

## సమస్యల మధ్యే ప్రారంభం

జగిత్యాల: ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 1163 పాఠశాలలుండగా 1,58,388 మంది విద్యార్థులున్నారు. అందులో 82,431 మంది బాలురు, 75,957 మంది బాలికలున్నారు. జిల్లాలో గత సంవత్సరం ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రారంభించగా ఈ సంవత్సరం నుంచి 9వ తరగతిలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈనెల 3 నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభించినా ఆశించిన మేర విద్యార్థులు చేరలేదు. సుమారు 500 మంది కొత్త విద్యార్థులు చేరినట్లు అధికారులు పేర్కొంటున్నా కార్యక్రమం సరిగ్గా సాగలేదు. కేవలం కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రమే తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పిల్లలతో మాట్లాడి తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం ఇప్పించినా ఎక్కువ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పాఠశాలల ఉపాధ్యాయులు పెద్దగా శ్రద్ధ చూపలేనట్లు తెలుస్తోంది. పదో తరగతి ఫలితాల్లోనూ జిల్లా పూర్తిగా వెనుకబడి పోయింది. మూడేళ్ల కిందట జిల్లా వరుసగా మూడు సంవత్సరాలు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవగా ఈసారి



24 స్థానంలో నిలిచింది.

నాణ్యత లోపం..జిల్లాలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న రీతిలో సాగుతున్నాయి. మొదటి విడత 274 పాఠశాలల్లో రూ.116.37 కోట్లతో గతేడాది మార్చిలో పనులు చేపట్టినా ఒప్పటి వరకు కేవలం 16 పనులు పూర్తి చేసి పాఠశాలలను ప్రారంభించారు. రూ.116.37 కోట్లలో రూ.73.07 కోట్లు పాఠశాల విద్యాశాఖ నుంచి రూ.11.39 కోట్లు ఉపాధి హామీ పథకం నుంచి వెచ్చిస్తున్నారు. పాఠశాలలో ఫర్నీచర్ ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.31.91 కోట్లు వెచ్చిస్తున్నారు. రూ.30 లక్షలలోపు పనులను పాఠశాల విద్యా కమిటీ ద్వారా ఆపై విలువైన పనులను టెండర్ ద్వారా అప్పగించారు. పంచాయతీరాజ్, రహదారి భవనాలశాఖ, నీటి పారుదలశాఖ పనులను పర్యవేక్షిస్తుండగా నాణ్యత లోపించినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రారంభించిన పనుల్లో మరో 17 పూర్తి కాగా 18 పనులు 75 శాతం పూర్తయ్యాయి. మిగతా 223 పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. తమ శాఖ పరిధిలోని పనులను నాణ్యతగా త్వరితగతిన చేయిస్తామని జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ రహమాన్ తెలిపారు.

## అనుసంధానిస్తేనే.. రైతుకు ఆనందం..!

భువనగిరి : వ్యవసాయానికి ఉపాధిహామీని పూర్తిస్థాయిలో అనుసంధానించాలని నీతి ఆయోగ్ 2016 ఏప్రిల్‌లోనే కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈజీఎస్ ద్వారా చేపట్టే పొలం పనుల ఖర్చును 75 శాతం రైతులు భరించేలా, 25 శాతం ప్రభుత్వం చెల్లించాలని సూచించింది. ఈ క్రమంలోనే సాగు పనులు ఉపాధిహామీకి జత చేయాలని రాష్ట్ర శాసనసభ కూడా గతంలోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. కానీ ఇప్పటి వరకు సాగు పనులు ఉపాధి హామీకి అనుసంధానించక పోవడంతో రైతాంగం ఇక్కట్లు ఎదుర్కొంటోంది.

పూర్తి స్థాయిలో చేపడితే ప్రయోజనకరం

కూరగాయల పందిళ్లు, షెడ్ల నిర్మాణం, బావుల తవ్వకం, పూడికతీత, ఫీడర్‌ఛానళ్లు, నీటినిల్వ కందకాల తవ్వకం, వర్మీకంపోస్టు గుంతల తవ్వకం, ఇంకుడుగుంతలు, పంటకుంటల నిర్మాణాలు కొంతవరకు చేపడుతున్నా.. కూలీల కొరత తీరే పనులు జాబితాలో చేర్చాల్సి ఉంది. అనుబంధ సాయం పూర్తిగా ప్రభుత్వం మంజూరిచ్చే నిధులతోనే సాగుతుండగా.. రైతులు కూడా కొంత వెచ్చించేలా అన్ని పనులు చేపట్టాలి. పత్తిగింజలు నాటడం మొదలుకొని వరినాట్లు, వరికోతలు, పత్తిలో దూదితీయడం, పైర్లలో కలుపు నివారణ, పైర్ల నూర్పిడులు తదితరాలను ఉపాధిహామీ కూలీలతో చేయించే వెసులుబాటు కల్పిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

బీ ఎన్ని రకాల యంత్రాలు వచ్చినా కూలీల కొరత నానాటికి తీవ్రమవుతుండటం సాగుకు ప్రధాన అవరోధంగా మారింది. ఒక దశలో కూలీల కొరత కారణంగా కొంతమంది భూమి పడావుగానే వదిలివేసి ఉంచుతున్నారంటే అతిశయోక్తి కాదు. 2021-22 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లు కలిపి 22.24 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగును చేపట్టినట్లు అధికారులు అంటున్నారు. మూడు జిల్లాలకు కలుపుకుని 15,95,394 మంది ఉపాధిహామీ కూలీలుండగా, రోజుకు సగటున రెండున్నర లక్షల మంది కూలీలకుపైగా ఉపాధిహామీ పనులకు వెళ్తుండగా.. రూ.130 కోట్లకుపైగా ప్రభుత్వం నిధులను వెచ్చిస్తుండటం గమనార్హం.

పత్తికి బదులు వరి పంటకే రైతుల మొగ్గు

కూలీల కొరత ఉన్నందున చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు కొనసాగే రోజుల్లో ఉపాధిహామీ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీల డిమాండ్ కారణంగా గత కొంత కాలంగా కొన్ని ప్రాంతాల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బిహార్, పశ్చిమబెంగాల్ లాంటి ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో పురుష కూలీలు వచ్చి వరినాట్ల పనికి పూనుకున్నారు. ఎకరానికి గుండుగుత్తగా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేసినట్లుగా తెలిసింది. పత్తిసాగుకు కూలీల అవసరం ఎక్కువగా ఉండనున్నందున వారి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కేవలం వరిసాగుకే కొందరు రైతులు మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. వ్యవసాయ కూలీల సమస్య వేధిస్తున్న నేపథ్యంలో వ్యవసాయానికి ఉపాధిహామీ పనులు అనుసంధానిస్తే రైతులకు కూలీల కొరత తీరి ఆర్థికంగానూ కలిసివస్తుంది. కూలీలకు కూడా ఏడాది పొడవునా పని లభించే అవకాశం ఉంటుంది. ఇప్పటి నుంచే వనాకాలం పొలం పనులు ముమ్మరంగా సాగుతాయి కాబట్టి ప్రధాన సాగు పనులు ఉపాధిహామీకి అనుసంధానించాలని రైతులు కోరుతున్నారు.

# కాటన్ మరమగ్గాలకు మంచి రోజులు



సిరిసిల్ల: కాటన్ వస్త్ర పరిశ్రమ కష్టాలు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మరమగ్గాలుంటే.. వాటిలో జిల్లాలోనే 31 వేల పైన ఉన్నాయి. వీటిపై పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తులు వేర్వేరుగా జరుగుతాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాల ఆర్డర్లు పూర్తిగా ఇక్కడికే కేటాయించడం, వాటిలోనూ పూర్తిగా పాలిస్టర్ ఉత్పత్తులే కావడంతో కాటన్ ఉత్పత్తులు కనుమరుగయ్యాయి. 20 వేలపైన కాటన్ మరమగ్గాల నుంచి 200కు పడిపోయాయి. వీటిలో చాలా వరకు తుక్కు కింద విక్రయించారు. 150 అద్దకం పరిశ్రమల్లో ప్రస్తుతం పది మాత్రమే మిగిలాయి. అవికూడా నెలలో సగం రోజులు పని లభించడం లేదు. వీటిపై ఆధారపడిన సుమారు 1500 మంది కార్మికులు క్రమంగా పాలిస్టర్ ఉత్పత్తుల వైపు వెళ్లారు. సిరిసిల్ల కాటన్ ఉత్పత్తులకు ఉమ్మడి రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్‌లలో మంచి డిమాండ్ ఉండేది. అలాంటి పరిశ్రమ కుదేలైంది. అన్ని రకాల వస్త్రోత్పత్తులు ఉంటేనే మనుగడ కొనసాగించడం సాధ్యం. దీని కోసం రూ.200 కోట్లతో వైద్య ఆరోగ్య శాఖకు అవసరమైన ఉత్పత్తుల ఆర్డర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

పరిశ్రమపై అధ్యయనం

జిల్లాలోని కాటన్ వస్త్రోత్పత్తులు, మరమగ్గాలు, అద్దకం, సైజింగ్ అనుబంధ రంగాలపై మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు చేనేత, జౌళిశాఖ బృందం అధ్యయనం చేసింది. వీటిపై ఎక్కువగా తెలుపు రంగు వస్త్రోత్పత్తులు జరగడం, పని చేసే కార్మికుల్లో ఎక్కువగా 70 ఏళ్లు పైబడినవారు ఉన్నారు. కుటీర పరిశ్రమగా ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి అయిదు సాంచాలు నడిపిస్తున్నారు. అద్దకం, సైజింగ్ పరిశ్రమలోనూ అదే పరిస్థితి. వీటికి అనుబంధంగా జూకీ మిషన్లతో వివిధ వస్త్రాలను ఆర్డర్ల మేరకు కుట్టడం, రవాణా, మార్కెటింగ్ వంటి రంగాలు ఉండేవి. ఇవన్నీ పూర్తిగా పాలిస్టర్, ఇతర రంగాలవైపు మళ్లాయి. పరిశ్రమను పూర్తిగా పాలిస్టర్ వస్త్రోత్పత్తులు ఆక్రమించాయి. భవిష్యత్తులో అనుకోని సంక్షోభం ఎదురైతే.. ఆ పరిస్థితులను తట్టుకునేలా ఇతర రంగాలను కూడా ప్రోత్సహించాలని నిర్ణయించారు. రెండు నెలల క్రితం రాష్ట్ర చేనేత, జౌళిశాఖలోని డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో అధికారుల బృందం చెన్నైలోని రాజపాల్యం గ్రామానికి వెళ్లింది.

దేశ వ్యాప్తంగా సరఫరా

రాజపాల్యంలోని వస్త్రోత్పత్తి పరిశ్రమ పూర్తిగా బ్యాండేజ్ (గాయాల కట్లకు) వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ తయారైన వివిధ రకాల బ్యాండేజ్ వస్త్రమే దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు సింహభాగం సరఫరా జరుగుతోంది. బ్యాండేజ్ ఉత్పత్తులకు వాడే నూలు, అద్దకం, సైజింగ్, ప్యాకింగ్ వంటి రంగాలపై వేలాది మంది ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వీరు ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని స్వయంగా మార్కెటింగ్ కూడా చేసుకుంటారు. వస్త్రం అవసరమున్న వ్యాపారులు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. మన రాష్ట్రం నుంచి వెళ్లిన అధికారుల బృందం నాలుగు రోజుల పాటు వారు ఉపయోగించే మరమగ్గాలు, వస్త్రోత్పత్తులు, మార్కెటింగ్ విధానాన్ని అధ్యయనం చేసింది. అక్కడి పరిశ్రమకు సిరిసిల్లలోని కాటన్ ఉత్పత్తులకు దగ్గరి పోలికలు ఉన్నాయి. దీని పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

రాష్ట్రానికి అవసరమయ్యేది...

జిల్లాలో ఇరవై వేలకు పైగా మరమగ్గాలపై నిత్యం 1.50 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తులు జరిగేవి. ఇప్పుడు వాటి సంఖ్య రెండు వందలకు పడిపోయింది. చిన్నపన్న (అడ్డంలో 36 ఇంచులు వస్త్రం వచ్చే) మరమగ్గాలు చాలా వరకు తుక్కు కింద విక్రయించారు. పెద్దపన్నవి చీరల ఉత్పత్తులకు అప్‌గ్రేడ్ చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన బ్యాండేజ్ వస్త్రాన్ని పూర్తిగా ఇక్కడే ఉత్పత్తి చేయించాలని నిర్ణయించారు. వీటిపై అవగాహనకు ఆసాములు, కార్మికులు, అద్దకం, సైజింగ్, ప్యాకింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు.

తుది దశలో ప్రణాళిక

కాటన్, దాని అనుబంధ రంగాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రణాళికలు చేస్తున్నాం. బ్యాండేజ్ వస్త్రం ఆర్డర్ల తుది నివేదిక ప్రభుత్వం వద్ద ఉంది. దశల వారీగా రాష్ట్రానికి అవసరమైన పూర్తి వస్త్రాన్ని ఇక్కడే తయారు చేయిస్తాం. దీనికి ముందు వస్త్రోత్పత్తిదారులు అనుబంధ రంగాల వారిని రాజపాల్యం తీసుకెళ్తాం. తర్వాత ఆర్డర్లు కేటాయించేందుకు ప్రణాళికలు చేస్తున్నాం. వీటితోపాటు వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో ఉపయోగించే దుప్పట్లు, ఇతర వస్త్రాల ఆర్డర్లను కేటాయించాలని మంత్రి హరీశ్‌రావుతో సంప్రదించాం. రైల్వేలోని ఉద్యోగులు, కార్మికుల అవసరాలకు ఉపయోగించే వస్త్రం కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. గూడూరి ప్రవీణ్, తెలంగాణ మరమగ్గాలు, జౌళి అభివృద్ధి సంస్థ ఛైర్మన్

## వరద నివారణకు ఎన్టీపీసీ చర్యలు



రామగుండం: ఎన్టీపీసీ విద్యుత్తు థర్మల్ కేంద్రాలు, జెన్‌కో 62.5 మెగావాట్ల బి-థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి వెలువడే బూడిద నీరు రామగుండం పట్టణంలోని చిన్న, పెద్ద కాలువల గుండా అబాది రామగుండం చెరువులోకి చేరుతోంది. చెరువు, కాలువలు పూర్తిగా బూడిద పూడికతో నిండి ఉండటంతో ఏటా వర్షకాలంలో వరద నీరు పొంగి రామగుండం పట్టణాన్ని జలమయం చేస్తోంది. ఈ క్రమంలో రామగుండం పట్టణంలోని జెన్‌కో ఎ-కాలనీ, పాతబజార్ వద్ద వరద నివారణ చర్యలను ఎన్టీపీసీ యాజమాన్యం చేపట్టింది. ప్రతిఏటా వర్షాకాలంలో ఇక్కడి పెద్ద, చిన్న కాలువలు పొంగి ఎ-కాలనీ, పాతబజార్, సబ్-స్టేషన్ ఏరియా, ఒడ్డెరకాలనీ, డెయిలీ మార్కెట్ ఏరియాలు నీట మునుగుతున్నాయి. వర్షాలు కురవక ముందే ఎప్పటిలాగే వరద నివారణ చర్యలు చేపట్టాలని ఎన్టీపీసీ, జెన్‌కో బి-థర్మల్ విద్యుత్తు కేంద్రం, నగరపాలక అధికారులను కోరినట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా సలీంబేగ్ తెలిపారు. గత మూడు రోజులుగా ఎన్టీపీసీ వారు పొక్లెయిన్ ఏర్పాటు చేయడంతో పెద్ద కాలువ పూడికతీత పనులు జరుగుతున్నాయి. పోస్టాఫీసు నుంచి పాతబజార్ వరకు కాలువ పూడికతీత చేపడుతున్నారు. వరదలకు ప్రధానంగా జెన్‌కో ఎ-కాలనీలోని బి, సి, డి, ఈ-టైపు క్వార్టర్లు పూర్తిగా మునిగి కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది భారీ వర్షాలకు అర్ధరాత్రి సమయంలో వరద నీరు ముంచెత్తి క్వార్టర్లు పూర్తిగా మునిగాయి.

మూడు రోజులపాటు ఐదు అడుగుల మేర నీటిలోనే కార్మికులు ఉన్నారు. ఇళ్లలో సామగ్రి అంతా నీటి పాలైంది. భారీ నష్టం జరిగినా సంబంధిత అధికారులు ఏవరూ పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపించాయి. చిన్న కాలువ పూడికతీతతోపాటు పెద్ద, చిన్న కాలువల కల్వర్టులు మరమ్మతు చేపట్టాలని, జెన్‌కో క్వార్టర్లు, గృహాల్లోకి వరద నీరు రాకుండా ముందుగా నివారణ చర్యలు తీసుకోవాలని జెన్‌కో ఉన్నతాధికారులను కార్మికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ముబారక్‌నగర్ నుంచి టెంపుల్‌రోడ్ వరకు ఇటీవల కొత్తగా తారురోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి(సైడ్‌బర్మ్) పోసి చదును చేపట్టలేదు. మట్టి పోయకుంటే వరద నీటి ప్రవాహానికి కొత్తతారు రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. గత వరదలకు సైతం తారురోడ్డు కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. పాలకులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## సింగరేణి ఆదాయం రెండింతలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ గడచిన ఏడాది భారీగానే లాభాలు ఆర్జించినట్లు తెలుస్తోంది. సింగరేణి సంస్థ 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,200 కోట్లకు పైగానే లాభాలు సాధించినట్లు అంచనా వేస్తున్నారు. అంతకు ముందు ఏడాది రూ.1227 కోట్లు లాభాలు సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 67.10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా 66.70 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసింది. దీని ద్వారా రూ.32,830 కోట్ల వ్యాపారం నిర్వహించింది. బొగ్గు, విద్యుత్తు అమ్మకాలపై రూ.2,200 కోట్ల వరకు నికర లాభాలు సాధించినట్లు భావిస్తున్నారు. కాగా దీనిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. లాభాలు ప్రకటించిన తర్వాతే కార్మికుల వాటాశాతాన్ని వెల్లడించే అవకాశం ఉంది. గత ఏడాది కార్మికులకు 30 శాతం లాభాల వాటా పంపిణీ చేశారు. అయితే ఈసారి లాభాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో తమకు ఎంత వాటా వస్తుందన్న విషయమై కార్మికులు లెక్కలు వేసుకుంటున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి లాభాలు, కార్మికులకు పంపిణీ చేసే వాటా మొత్తాన్ని ప్రకటించారు.

నెల రోజుల్లో ప్రకటన?సింగరేణి సాధించిన లాభాలను నెల రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సంస్థ సాధించిన లాభాలను అధికారికంగా ప్రకటించి వెంటనే వాటాశాతాన్ని సైతం ప్రకటించనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు గడిచిపోయింది. లాభాలు ఎంత వచ్చాయన్న దానిపై కార్మికుల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కోల్‌బెల్టు పర్యటనలో భాగంగా లాభాలు ఎంత వచ్చే అవకాశం ఉందన్న విషయాన్ని వెల్లడించడంతో సింగరేణి యాజమాన్యం వాటికి సంబంధించిన లెక్కలు పూర్తి చేసినట్లు భావిస్తున్నారు. ఆడిట్ పూర్తి కాగానే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.కార్మికుల్లో ఆసక్తిలాభాల వాటా ఎప్పుడు చెల్లిస్తారన్న ఆసక్తి కార్మికుల్లో నెలకొంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాల స్థాయిలో పిల్లల చదువులకు సంబంధించిన ఫీజులు, ఇతరత్రా ఖర్చులు ఉంటాయి.

## ప్రగతి తప్పిన పథకం

సూర్యాపేట :తిరుమలగిరిలోని మూడో వార్డులో పట్టణ ప్రగతి నిధులతో మురుగు కాల్వ నిర్మించారు. నిర్మాణం పూర్తయినా నేటికీ బిల్లులు రాలేదు. దీంతో గుత్తేదారులు రెండు నెలలుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగి వెళ్తున్నారు. అధికారులు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు. మిగతా పురపాలికల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పురపాలికలకు పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. దీంతో నిధుల విడుదలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలక సంఘాలు ఎదురుచూస్తున్నాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని వస్తున్న గుత్తేదారులకు సమాధానం చెప్పలేక అధికారులు సందిగ్ధంలో పడుతున్నారు. ప్రతిపాదించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండగా.. బిల్లులు చెల్లించనిదే పనులెలా చేయాలంటూ గుత్తేదారులు వాపోతున్నారు.

ఐదు నెలలుగా నిరీక్షణ

రాష్ట్ర ప్రభుత్వం 2020లో పట్టణ ప్రగతి పథకాన్ని ప్రవేశపెట్టింది.



కేంద్ర ప్రభుత్వం నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం పైకం జమచేసి ప్రతినెలా బిల్లులు చెల్లించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. జనాభా ప్రాతిపదికన పురపాలక సంఘాలకు ఎన్ని నిధులు కేటాయించాలో ముందుగానే నిర్దేశించి పనులను ప్రతిపాదించేవారు. పూర్తయ్యాక వందశాతం నిధులు వెంటనే విడుదలయ్యేవి. 2021 ఆగస్టు నుంచి పట్టణ ప్రగతిలో సుమారు 25 శాతం నిధులకు కోత విధించింది. మిగిలిన 75 శాతం డబ్బులను కూడా క్రమం తప్పకుండా విడుదల చేయడం లేదు. ఐదు నెలలు దాటినా నేటికీ నిధుల విడుదలకు మోక్షం లభించడం లేదు.

అభివృద్ధికి ఆటంకం

పట్టణ ప్రగతి నిధులు విడుదల కాకపోవడంతో పురపాలికల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. పలు నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడంతో పై అధికారుల నుంచి మున్సిపల్ అధికారులకు ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి. గుత్తేదారులు మాత్రం బిల్లులు ఇవ్వకుంటే పనులు చేయలేమంటూ చేతులెత్తేస్తున్నట్లు తెలుస్తోంది. ‘పట్టణ ప్రగతి నిధులు విడుదల కాకపోవడంతో ఆయా పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయ’ని మున్సిపల్ కమిషనర్లు తెలిపారు.

## మాట వినకుంటే..మార్చుడే..!

సూర్యాపేట : నూతనంగా ఏర్పాటైన మాడ్గులపల్లి తహసీల్దార్ కుర్చీ మూడు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వర్తించిన తహసీల్దార్ అర్చన మునుగోడు మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో నాయబ్ తహసీల్దార్ శివశంకర్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నాయబ్ తహసీల్దార్ తన విధులతో పాటు తహసీల్దార్ విధులు కూడా నిర్వర్తించాలంటే ఇబ్బందిగా ఉంది. భూమి రిజిస్ట్రేషన్లు, ప్రొటోకాల్, ఇతరాత్ర పనులు చక్కబెట్టాలంటే సమస్య వస్తోంది. మాడ్గులపల్లి మండలానికి తహసీల్దార్‌గా వచ్చిన వారెవరూ ఏడాది పాటు నిలకడగా పనిచేయలేక పోతున్నారు. మండలం ఏర్పడి ఆరేళ్లు పూర్తయింది. ఇప్పటికే పది మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. బదిలీ కాని వాళ్లు కూడా ఎక్కువ రోజులు సెలవులు పెడుతున్నారు. మాడ్గులపల్లి మండలం నల్గొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. తిప్పర్తి, నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి నుంచి 28 గ్రామపంచాయతీలను కలిపి మండలంగా ఏర్పాటు చేశారు. ఇదే అసలు సమస్య అయింది. మూడు నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు తమ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వస్తారు. ఏ ఒక్కరికి న్యాయం జరగక పోయినా విషయం సంబంధిత ఎమ్మెల్యే దృష్టికి వెళ్తుంది. వారి నుంచి ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో ఇక్కడ ఎవరూ పని చేయలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు ఇవ్వాలన్నా స్థానిక ప్రజాప్రతినిధుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. మూడు నియోజకవర్గాల నుంచి సమస్యలు పరిష్కరించాలంటే ఇక్కడికి వచ్చే తహసీల్దార్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి తట్టుకోలేక పలువురు దీర్ఘకాలిక సెలవు పెట్టి బదిలీపై వెళుతున్నారు. ఇప్పుడు ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో కొత్తగా ఎవరినైనా పంపుతారేమో అని మండల వాసులు ఎదురుచూస్తున్నారు. పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టేలా తహసీల్దార్‌ను ఇక్కడికి బదిలీ చేయాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివశంకర్ కోరారు. ఇన్‌ఛార్జిగా ఉండి ప్రజల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించలేక పోతున్నానన్నారు.

## సారొస్తున్నారని..!

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 21న నగరానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు రానుండటంతో కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. బల్దియాలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఇక్కడి నుంచి ప్రారంభించనుండటంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. కార్పొరేటర్ల సమావేశ మందిరం, లిఫ్టు, విద్యుత్తు పనులకు మోక్షం లభించింది. ముఖ ద్వారంలో టైల్స్, కార్యాలయం బయట రంగులు వేయనున్నారు. ఆవరణలో ఉన్న మొక్కలు, పార్కింగ్ స్థలాన్ని శుభ్రం చేస్తున్నారు. గుంతలు లేకుండా మట్టి పోయిస్తున్నారు. వారం రోజుల్లో మూడు అంతస్తులలో పనులు పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని మేయర్ సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్ ఆదేశించడంతో ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తు న్నారు.కార్యకలాపాలకు అంతరాయంకార్యాలయంలో విద్యుత్తు నిలిపి వేయడంతో ప్రధాన విభాగాలకు అంతరాయం కలిగింది. కింది భాగం, మొదటి, రెండు అంతస్తులకు ఒక వైపు విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కావడంతో ప్రజల ఎక్కువ సంఖ్యలో రాగా, మధ్యాహ్నం వరకు చీకటిగా ఉండటంతో సమస్యలు తప్పలేదు. దుమ్ము, ధూళి వస్తుండటంతో ఉద్యోగులు ఎక్కడ కూర్చోవాలో తెలియక సతమతమయ్యారు.

# ‘భద్రకాళిపై భూబకాసురుల కన్ను’

రంగంపేట : భూబకాసురుల నుంచి భద్రకాళి చెరువును రక్షించాలని, ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా చెరువు స్థలాల్లో మట్టి నింపుతుంటే హనుమకొండ జిల్లా యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రైవేటు గూండాల పహారాలో 24 గంటలూ మట్టి నింపుతున్నారన్నారు. సోమవారం హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డులో ఆక్రమణకు గురవుతున్న భద్రకాళి చెరువు స్థలాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సుమారు 30- 40 ఎకరాల భూమిని సొంతం చేసుకునేందుకు భారాస నాయకులు యత్నిస్తున్నారని, రెండు, మూడు చోట్ల చెరువు కట్టను తెంచేసి మురుగు నీటిని మళ్లిస్తున్నారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. హనుమకొండ పోచమ్మకుంటలోని హనుమాన్ గుడి స్థలాలు వరంగల్‌లోని వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేశారని విమర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నాయకత్వంలో విజయ్‌భాస్కర్, సోదా కిరణ్, రంజిత్‌రెడ్డి విచ్చలవిడిగా కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. వరంగల్ పోలీసు కమిషనర్ వద్ద నమోదవుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం భారాస నాయకులవేనని ఆరోపించారు. హనుమకొండ నగరం నడిబొడ్డున చెరువును కొల్లగొడుతుంటే అధికారులు మౌనంగా ఉండటం సరైంది కాదన్నారు. భద్రకాళి చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు



చేస్తామని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

**ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం**

ఈనెల 20 లోగా అర్హులైన వారందరికీ రెండు పడకల ఇళ్లు ఇవ్వకపోతే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇంటిని ముట్టడిస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. డీసీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లవుతున్నా ఇంత వరకు వరంగల్ నగర పరిధిలో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే అనుచరులు ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. తొమ్మిదేళ్లలో ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కాజీపేట బస్టాండ్, కొత్త ఆర్వోబీ ఏమైందని నిలదీశారు. రింగు రోడ్డు, వరంగల్ మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, కార్పొరేటర్లు తోట వెంకన్న, శ్రీమాన్, జిల్లా నాయకులు లక్ష్మణ్, సరళాయాదవ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠధామం.. వసతులు శూన్యం

భూపాలపల్లి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని వైకుంఠధామం.. విద్యుత్తు సౌకర్యం ఉన్నా బోరు వేయించలేదు.. దహన సంస్కారాల అనంతరం స్నానాలకు దగ్గరలోని బావులు, కుంటలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో గాలివానకు వైకుంఠధామం పైకప్పు రేకులు మొత్తం పగిలిపోయాయి. కనీసం నీడ కరవైంది.పల్లెల్లో ఎవరైనా మరణిస్తే.. మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయడాన్ని పవిత్ర కార్యంగా భావిస్తారు. అలాంటిది దహన సంస్కారాలు సరిగా జరగకపోతే ఆవేదనకు గురవుతారు. ఈ ఇబ్బందులు ఉండొద్దనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించింది. అయితే విద్యుత్తు, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కొరవడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాలు 241 పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వైకుంఠ ధామాలను నిర్మించారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తుండటంతో పేరుకే అన్నట్టు ఉన్నాయి. 241 గ్రామాల్లో కేవలం 48 శ్మశాన వాటికలకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం ఉంది. 107 వైకుంఠ ధామాలకు మాత్రమే నీటి వసతి ఉంది. మిగిలిన వాటిల్లో విద్యుత్తు, నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

**ఇప్పటికీ శిఖం భూముల్లోనే..**

ప్రభుత్వం శ్మశానవాటికలకు ఉపాధి హామీ నిధులు వెచ్చించింది. చాలా చోట్ల బోర్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు లేకపోవడంతో శిఖం భూములు, పంట పొలాలు, కాలువ గట్లపైన మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో అక్కడి వరకు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**సౌర దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

– ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లా వ్యాప్తంగా నిర్మించిన వైకుంఠ ధామాల్లో ఎక్కడైతే విద్యుత్తు సౌకర్యం లేదో అక్కడ సౌర దీపాలను ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఒక గుత్తేదారు సంస్థతో మాట్లాడి పనులకు సంబంధించి అంచనా వేశారు. నీటి సౌకర్యం లేని శ్మశాన వాటికల్లో చేతిపంపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# అంతరిక్ష పాఠం.. ఇనుమడించు విజ్ఞానం



మణుగూరు : అంతరిక్ష విజ్ఞానంపై మరింత పట్టు సాధించాలనుకునే ఉపాధ్యాయులకు సువర్ణావకాశం. ఇస్రో పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఆర్ఎఎస్) ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పాఠాలను అందిస్తోంది. ఉపగ్రహ ఛాయా చిత్రాలపై విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా ప్రోత్సహిస్తోంది. ప్రతిఏటా వేసవి సెలవుల్లో ఈ శిక్షణ నిర్వహించగా ఈసారి కొంత ఆలస్యమైంది. ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్మీడియట్) వరకు బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు శిక్షణకు అర్హులు. ఐదు రోజుల కోర్సు తర్వాత శిక్షకులు ప్రశ్నపత్రం పూరించి నివేదించాల్సి ఉంటుంది. ప్రతిభ కనబర్చిన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు. ఈ శిక్షణతో అంతరిక్ష పాఠాలపై ఉపాధ్యాయులకు మరింత విజ్ఞానం పెరగనుంది.

**ప్రతిభకు పట్టా..**

ఇస్రో అంతరిక్ష ఆన్‌లైన్ శిక్షణలో కాలానికనుగుణంగా కొత్త అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, వాటి అనువర్తనాలు అనే అంశంపై తరగతులు నిర్వహించనున్నారు. స్పేస్ క్రాఫ్ట్ సిస్టమ్, ప్లానెటరీ సైన్స్, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, వాతావరణ సమాచారం, దూరవిద్య, పర్యావరణ శీతోష్ణస్థితిపై అధ్యయనం, ఆహారం, నీటి భద్రత, ప్రకృతి వైపరీత్యాలు అనే అంశాలపై పట్టు పెంచనున్నారు. 70 శాతం హాజరు, ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు మెయిల్ ద్వారా ధ్రువపత్రాలను ఇస్రో అందజేస్తుంది.

**2007లో 300 మందితో..**

పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉపగ్రహ పాఠాలపై విజ్ఞానం అందించేందుకు ముందుగా ఉపాధ్యాయుల మేధస్సుకు పదును పెట్టాలని నిర్ణయించారు. తొలిసారిగా 2007లో ఈ విధానాన్ని ప్రారంభించారు. గతంలో 300 మంది ఉపాధ్యాయులతో ప్రారంభమైన ఈ శిక్షణకు ప్రతి సంవత్సరం ఆదరణ పెరుగుతుంది. లక్షలాది మంది ఉపాధ్యాయులు శిక్షణ తీసుకుంటూ ధ్రువపత్రాలు అందుకుంటున్నారు.

**శిక్షణ విధానం..**

ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ, గురుకుల విద్యాలయాల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భౌతిక, రసాయన, జీవశాస్త్ర, గణితశాస్త్ర ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐఆర్ఎస్.జీవోవీ.ఇన్ అనే లింక్ ద్వారా చరవాణి, జీమెయిల్‌తో పేరు, ఉద్యోగ అర్హతలు, తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శుక్రవారం వరకు గడువు విధించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా ఈనెల 19 నుంచి 23 వరకు ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలు, శీతోష్ణ స్థితులు, ఉపగ్రహ ఛాయాచిత్రాలను విశ్లేషించనున్నారు.

ఇస్రో అంతరిక్ష పాఠాలు నేర్చుకునేందుకు సైన్స్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ శిక్షణతో శాస్త్రీయ విజ్ఞానం పెరగనుంది. ఆధునిక, సాంకేతికతను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలపై పట్టు పెంచుకోవచ్చు. ఐదు రోజులపాటు శిక్షణ తరగతులకు హాజరు కావాలి. నూతన విషయాలపై అవగాహన పెంచుకునేందుకు ఇది చక్కటి వేదిక. చలపతి రాజు, జిల్లా సైన్స్ అధికారి, భద్రాద్రి

# ప్రణాళిక ముఖ్యం.. పొదుపే మంత్రం



ఖమ్మం : వేసవి కాలంలో ఆటపాటల్లో మునిగితేలిన పిల్లలు ఇక ఉరుకులు పరుగులతో బడిబాట పడుతున్నారు. నాణ్యమైన విద్య ఆశతో తమ పిల్లలను ప్రైవేటు బడుల మెట్లు ఎక్కించడం కోసం తల్లిదండ్రులు ప్రత్యేకించి జూన్‌లో పడే తంటాలు అన్నీఇన్నీ కావు. ప్రతి నెలా ఉండే సాధారణ వ్యయాలతో పాటు ఈనెలలో వారి పిల్లల చదువులకయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. ద్రవ్యోల్బణానికి తగ్గట్టుగా పుస్తకాలు, దుస్తులు, బ్యాగులతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు ఏటా పెరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై నిపుణుల సూచనలతో ప్రత్యేక కథనం.

**అనవసర ఖర్చులు తగ్గించుకోండి**

ముందుగా తల్లిదండ్రులు అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. లేదా తరవాత నెలకైనా వాయిదా వేసుకోవాలి. పుట్టినరోజు, పెళ్లిరోజు అంటూ భారీగా ఖర్చు చేయకుండా ఆ డబ్బులను పిల్లల చదువులకు వెచ్చిస్తే పేద, మధ్యతరగతి వారికి ఉపయుక్తంగా ఉంటుంది. వేడుకలను అట్టహాసంగా నిర్వహించినా రోజులు గడిచేకొద్దీ వాటి గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరనే వాస్తవాన్ని గ్రహించాలి. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కంటే తాత్కాలిక సంతోషం కోసం ఎక్కువ ఖర్చు చేయటం ఎట్టిపరిస్థితుల్లోనూ మంచిది కాదని తెలుసుకొని మసలుకోవటం ముఖ్యం.

పిల్లల చదువుల ఖర్చును అధిగమించడానికి చాలామంది అప్పులు చేయాల్సి వస్తోంది. అవకాశాన్ని బట్టి దీర్ఘకాలంలో స్వల్ప మొత్తాల్లో అప్పులను తీర్చుకునే వెసులుబాటును కల్పించుకోవాలి. ఉదాహరణకు స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుబంధ రుణాలు, స్త్రీ నిధి రుణాలు ఇందుకు దోహదపడతాయి.

ఆది నుంచే పిల్లల చదువులు, వారి ఖర్చులపై ప్రణాళిక రచించాలి. అందుకు అనుగుణంగా ప్రతినెలా పొదుపు చేయగలగాలి.

పిల్లల చదువులకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వటం మంచి పరిణామం. అయితే అదే సమయంలో ఆదాయ పరిమితిని దృష్టిలో ఉంచుకోవాలి. చదువుల కోసం భారీగా అప్పులు చేయటం తగదు. పాఠశాల సమయం ముగిశాక పిల్లల హోంవర్క్‌పై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. తెలిసిన మేరకు రోజూ కొన్ని విషయాలు చెబుతుంటే విద్యార్థులు చురుగ్గా తయారవుతారు.

ఆర్.రాఘవేంద్ర, ఆర్థికశాస్త్ర నిపుణుడు, మణుగూరు

ఉన్న ఆదాయం సరిపోకపోతే అదనపు రాబడి మార్గాలను అన్వేషించాలి. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్టు కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ అవకాశాలను బట్టి ఆదాయం సముపార్జించాలి. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడితేనే పిల్లల చదువులు, ఇతర ఖర్చులను ఎదుర్కోగలం.

కె.రామలింగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ ప్రతినిధి

తల్లిదండ్రులు దుబారా ఖర్చులను తగ్గించుకుంటే మేలు. ఇటీవల కాలంలో అనవసర గొప్పతనాలకు పోతున్నారు. శక్తికి మించి పిల్లల వేడుకలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఏమేరకు గొప్పతనం వస్తుందో తెలియదు కానీ ఖర్చులు మాత్రం రూ.లక్షల్లో ఉంటున్నాయి. ఒక్కరోజు మురిపెం కోసం పెట్టే ఆ ఖర్చులను పిల్లల చదువులకు వెచ్చిస్తే వారి జీవితాలు మెరుగుపడతాయి. ఎం.రామిరెడ్డి, ఆర్థికశాస్త్ర నిపుణుడు, భద్రాచలం

# ఖమ్మం గుమ్మంలో రాజకీయ వేడి

ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్నకొద్దీ రాజకీయ వేడి రాజుకుంటోంది. ప్రధాన పార్టీలు ప్రజాక్షేత్రంలో తలమునకలవుతున్నాయి. ఇందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికవుతోంది. భాజపా, కాంగ్రెస్ అగ్రనేతలు ఖమ్మం దారి పడుతుండటం, వామపక్ష పార్టీలు సైతం ఇక్కడి నుంచే ఎన్నికల క్షేత్రంలోకి దిగేలా కార్యాచరణ రూపొందించుకోవడంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

**చంద్రబాబు రాకతో తెలుగు తమ్ముళ్లలో జోష్**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గతేడాది ఆఖరులో ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభకు హాజరై పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు జరిగాయి. కేరళ సీఎం పినరయి విజయన్ హాజరై సమరోత్సాహం నూరిపోశారు.

**భారాస ఆవిర్భావ సభతో మొదలు..**

జాతీయ రాజకీయాల్లో సత్తా చాటాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఆరంభంలోనే తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మారుస్తూ.. ఆవిర్భావ సభను ఖమ్మంలో నిర్వహించారు. ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో పురుడు పోసుకున్న భారాస.. జాతీయ రాజకీయాల్లో రాణిస్తుందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కొత్తగూడెం వేదికగా ప్రజాగర్జన పేరిట ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభతో సీపీఐ.. ఎర్రదండును కదనరంగంలోకి దింపింది.

**భాజపా అగ్రనేతల రాక..**

ఖమ్మంలో జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను కమలదళం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీకి బలం లేదన్న చోటే సత్తా చాటాలనే తలంపుతో ఉంది. సభకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పొరుగున ఉన్న జిల్లాల నుంచి జనాలను సమీకరించేందుకు ఆపార్టీ నాయకులు వ్యూహాలు పన్నుతున్నారు. జులైలో కొత్తగూడెంలో మరో భారీ బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తున్నారు. ఆ సభకు ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు కసరత్తు చేస్తున్నారు. నెల వ్యవధిలోనే ఇద్దరు అగ్రనేతల పర్యటనతో పార్టీ నాయకులు, శ్రేణుల్ని ఎన్నికల క్షేత్రంలోకి దించేలా భాజపా ప్రణాళికలు రచిస్తోంది.

# విద్యార్థులకు రాగిజావ

జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానిని చేర్చగా, ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా ఉదయం వచ్చే సమయంలో ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడంలేదు. ఫలితంగా రక్తహీనత, పోషకాహార లోపంతో కనిపించడంతోపాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవం నుంచే కొత్త కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని 753 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 65 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా కార్యాచరణ రూపొందించారు.

**స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలు..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బెంగళూరు కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ



ట్రస్టు జగిత్యాల ఆధ్వర్యంలో దాదాపు 320 పాఠశాలల్లో చదివే 32 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. 2015లో జగిత్యాలలోని మోతె గ్రామ శివారులోని నాగేంద్రనగర్ కాలనీలో 50 మంది విద్యార్థులకు పాలు, హార్లిక్స్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించాగా ప్రస్తుతం గత ఏప్రిల్ వేసవి సెలవుల వరకు దాదాపు 50 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా చూశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా పాఠశాల సెలవుల్లో మిగిలిపోయిన రాగి జావ పౌడర్‌ను జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, రజకులు దాదాపు 1670 కుటుంబాలకు కిలో చొప్పున అందించారు. ఇందులో జగిత్యాలలో 350 పారిశుద్ధ్య, 700 రజక, మెట్‌పల్లి, జమ్మికుంటలో 300 కుటుంబాల చొప్పున పారిశుద్ధ్య కుటుంబాలకు అందించారు.

**పేద పిల్లలకు ప్రయోజనకరం**

గోవర్ధన ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

ఉదయం పూట ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు రాగిజావ అందించడం మంచి నిర్ణయం. ఇప్పటికే పలు పాఠశాలల్లో అన్నపూర్ణ సత్యసాయి ట్రస్టు ద్వారా రాగిజావ అందిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని నిర్ణయించడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలోనూ వెజిటబుల్ బిర్యానిని చేర్చారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అంది చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపే అవకాశంతో పాటు విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది.

**జిల్లాలో పంపిణీ చేస్తున్నాం**

ఊటూరి శ్రీకాంత్, ట్రస్టు రీజినల్ సమన్వయ కర్త

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి పోషకాహార లోపంతో బాధపడకూడదని ఇప్పటికే పలు పాఠశాలల్లో రాగిజావ అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు గతేడాది చివరి వరకు అందించేలా చూశాం. వేసవి సెలవుల్లో మిగిలిన రాగిజావ పౌడర్‌ను జిల్లాలోని దాదాపు వెయ్యికి పైగా పారిశుద్ధ్య, రజక కుటుంబాలకు అందించాం. ప్రస్తుతం ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అందించేలా ట్రస్టు ఆలోచన చేస్తుంది.

# పైపైనే జలం.. సాగుకు బలం

జగిత్యాల : యాసంగి ముగిసి వానాకాలం పైర్లసాగు ముంగిట జిల్లాలోని మండలాల్లో లభ్యతగల భూగర్భ జలాలు అన్నదాతలకు ఆశాజనకంగా మారాయి. 2022 మే నెలాఖరున 5.81 మీటర్ల లోతుతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత పైనే 5.51 మీటర్ల సరాసరి లోతులో ఉండటం పైర్లసాగుకు ఉపకరించనుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీటిని వదలగా వరద కాలువలోకి కూడా పలు దఫాలుగా నీటిని విడుదల చేశారు. దీంతోపాటు కాకతీయ, వరదకాలువలు, ఇతర డిస్ట్రిబ్యూటరీల నుంచి కూడా చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయటంతో వేసవి ముగిసినా చాలా నీటి వనరులు జలంతోనే నిండి ఉన్నాయి. వాగులు, ఒర్రెల్లోనూ నీరు పారుతుండగా భూగర్భ జలమట్టం పైపైనే ఉండి నెలరోజులు ముందుగా పంటలను సాగుచేయాలన్న ప్రభుత్వ సూచనకు దోహదకారిగా మారింది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.726 టీఎంసీల నీరు నిలువుంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎల్లంపల్లి నుంచి జలాలను ఎత్తిపోసి వరద కాలువలో నిండుగా నిల్వచేసే వీలుండటం, సగటు భూగర్భ జలమట్టం 5.51 మీటర్లుగా ఉండటం వానాకాలం పైర్లసాగుకు కలిసిరానుంది. కాలువలతో పాటుగా బావులు, బోర్లలోనూ సమృద్ధిగా నీరుండగా మోటార్ల ద్వారా నీటిని తోడుకునే వీలుండటంతో వరినార్లకు అవకాశం కలిగింది. ప్రస్తుతం కనిష్ఠ స్థాయిలో భూగర్భ జలాలుండటంతో 1.27 లక్షల పంపుసెట్ల ఆధారితంగా జిల్లాలో పైర్లసాగుకు అవకాశం ఏర్పడిందని భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి జి.నర్సింహులు పేర్కొన్నారు.ఈ వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా ఇందులో అత్యధికంగా 2.98 లక్షల ఎకరాల్లో వరిని పండించనున్నారు. ఇప్పట్నుంచి జులై నెలాఖరు వరకు పెద్దఎత్తున వరినార్లు పోసి సెప్టెంబరు వరకు వరినాట్లు వేస్తారు కాబట్టి వీరికి జల లభ్యత ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలతో ప్రాజెక్టుల నీటి లభ్యత, భూగర్భ జలాల అందుబాటుతో రైతులు వానాకాలం పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతుండగా ప్రకృతి కరుణించి సమృద్ధి వర్షాలు కురిసి, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలు సిద్ధిస్తే ఈ సీజన్‌లోనూ రైతులు మెండైన పంటలను సాగుచేయగలుగుతారు.

# పరిజ్ఞానం.. అధ్యయనం.. తయారీ

ములుగు : మానవాళికి వృక్షాలు ఎంత అవసరమో అందరికీ తెలిసిందే. ప్రజలకు ఉపయోగపడే ఎన్నో రకాల వస్తువుల తయారీకి వీటి నుంచి వచ్చే కలపే కీలకం. అలాంటి కలపపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అటవీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో వీటిపై పరిజ్ఞానం పెంచడంతో పాటు పరిశోధన సాగించేలా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో లభించే కలప వివరాలు, వాటితో ఏమేమి, ఎలా తయారు చేస్తారు తదితర అంశాలపై పరిశోధించేందుకు ములుగు అటవీ కళాశాల పరిశోధనా కేంద్రంలో కలప ఉత్పత్తుల, అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పడం విశేషం. రాష్ట్రంలో తొలిసారిగా దీన్ని ఏర్పాటుచేశారు. దేశంలోని అడవుల సంరక్షణకు అన్ని స్థాయిల అధికారులను అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండల కేంద్రంలో అటవీ కళాశాల పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ, బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులతో పాటు పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇక్కడ ఆయా కోర్సులు అభ్యసిస్తున్న వారి కోసం ప్రత్యేకంగా ప్రయోగశాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో విద్యార్థులకు కలపకు సంబంధించి అనేక అంశాలపై ఆవగాహన కల్పిస్తున్నారు.

80 రకాలపై..అధ్యయనం చేసేందుకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రధాన అడవుల్లో లభించే చెట్లకు సంబందించిన 80 రకాల



నమునాలను అధికారులు భద్రపరిచారు. ఆయా వాటి లక్షణాలు, దాని స్థితిగతులు, కలపలో ఉండే పొరలు, ఎన్నేళ్ల పాటు నాణ్యతగా ఉంటాయి, తదితర అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పరిశోధన చేయిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా అవసరమయ్యే అధునాతన సూక్ష్మ పరికరాలను ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు.

ఇతర రాష్ట్రాల నుంచి..దేశంలో రెండే అటవీ కళాశాలలు ఉన్నాయి. ఒకటి కోయంబత్తూరులో, మరొకటి ఇక్కడ ఉంది. అధునాతన సౌకర్యాలు, అన్ని హంగులతో దీన్ని నిర్మించారు. ఇప్పటికే దీన్ని విశ్వవిద్యాలయంగా మార్చేందుకు మంత్రిమండలి కూడా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే ఇతర రాష్ట్రాలకు చెందిన అటవీ శాఖ అధికారులను ఇక్కడికి తీసుకొచ్చి కలప సమగ్ర వివరాలపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు నిష్ణాతులను రప్పించి అవగాహన కల్పిస్తుండటం గమనార్హం. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సైతం ఈ కేంద్రానికి వచ్చి పలు అంశాల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు.

వివిధ రకాల తయారీ..కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు అన్ని రకాల కలపపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. చెట్ల రకాలు, ఎలాంటివి ఏ అవసరాలకు వినియోగిస్తున్నారన్నది తెలియజేస్తున్నారు. మరో వైపు పలు రకాల వస్తువులను తయారు చేయిస్తున్నారు. ఆలోచనలకు అనుగుణంగా రూపొందింపజేస్తున్నారు. వారు తయారు చేసిన వాటిని ప్రదర్శనగా ఉంచారు. గమ్, జింకు, ప్లైవుడ్, తలుపులు, కిటికీలు, తదితర వస్తువుల రూపకల్పనకు సంబంధించి తర్ఫీదు ఇస్తున్నారు. అధునాతన పరికరాలను వినియోగిస్తూ ఎలా తయారు చేయాలో నేర్పిస్తున్నారు.

ద్వినియోగం చేసుకోవాలి- ప్రియాంక వర్గీస్, డీన్, అటవీ కళాశాల పరిశోధన కేంద్రం

అటవీ శాఖకు సంబంధించి అన్ని రకాల అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో తొలిసారిగా ఇక్కడ కలప కేంద్రం నెలకొల్పాం. అన్ని సౌకర్యాలు కల్పించాం. భవిష్యత్తులో ఇక్కడ మరిన్ని పరికరాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

# బీమా.. నేతన్నకు ధీమా

సంగారెడ్డి : చేతి వృత్తులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఉపాధి పొందేందుకు వీటిపైనే ఆధారపడ్డారు. కులవృత్తుల ద్వారా ఎంతో మందికి చేతి నిండా పని దొరకడంతో పాటు కడుపు నిండా తిండి దొరికేది. ఉపాధికి ఎలాంటి ఢోకా ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నం. కులవృత్తిని నమ్ముకునే వారు పస్తులుండాల్సిన పరిస్థితులు. చేనేత వృత్తిదారులే ఇందుకు ఉదాహరణ. దీనిపై ఆధారపడ్డ చాలా మందికి గిట్టుబాటు కాకపోవడంతో వేరే ఉపాధి రంగాల వైపు మళ్లాల్సి వచ్చింది. కొందరు విధిలేని పరిస్థితుల్లో ఈ వృత్తిపైనే ఆధారపడి కొనసాగిస్తున్నా ఇబ్బందులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేతన్నకు ధీమా కల్పించేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని తీసుకొచ్చింది.

ప్రీమియం చెల్లించకుండానే..నేతన్నకు బీమా పథకం ఈ నెల 7వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం అమలులో ఉన్న రైతుబీమా తరహాలోనే సదరు పథకాన్ని చేనేతలకు వర్తింపజేసి అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేనేత కార్మికుల కుటుంబాలకు ఈ పథకం భరోసా ఇవ్వనుంది. నోడల్ ఏజెన్సీగా చేనేత, జౌళి శాఖ వ్యవహరించనుంది. ఈ మేరకు భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సదరు పథకంలో చేరేందుకు కార్మికులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు.

రూ.5 లక్షలు సాయం

సంగారెడ్డి జిల్లాలో నాలుగు చేనేతకార్మిక సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లో 105 మంది కార్మికులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 500 మందికి పైగా ఉన్నారు. 60 ఏళ్లలోపు వయసున్న చేనేత కార్మికులు బీమా పథకంలో చేరేందుకు అర్హులు. ఇందుకు అనుగుణంగా 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల కార్మికుల జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పథకం అమల్లోకి వస్తే చేనేత కార్మికుడు చనిపోయిన పది రోజుల్లో రూ.5 లక్షల సాయం బాధిత కుటుంబానికి అందనుంది.

మార్గదర్శకాలు అందగానే..: విజయలక్ష్మి, చేనేత జౌళి శాఖ ఏడీ

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే నేతన్నకు బీమా పథకాన్ని ఈనెల 7 నుంచి అమల్లోకి తీసుకురానుంది. కార్మికులు, వారి కుటుంబాలకు ఇది ధీమానిస్తుంది. అర్హులైన కార్మికుల జాబితాను సిద్ధం చేస్తున్నాం. పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు అందగానే అందుకు అనుగుణంగా ముందుకు సాగుతాం.

# ముసురుతున్న వ్యాధులు.. ముందస్తు జాగ్రత్తలే మేలు



మెదక్ : శివ్వంపేట మండలం గోమారానికి చెందిన నర్సమ్మ జ్వరంతో బాధపడుతూ నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేరారు. పరీక్షల అనంతరం టైఫాయిడ్ అని తేలడంతో చికిత్స ప్రారంభించారు. దోమలతో అనారోగ్యానికి గురైనట్లు వైద్యులు గుర్తించారు. నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి తండాకు చెందిన హంసీబాయి వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. కలుషిత ఆహారం తినడం, నీటిని తాగడం వల్లనే అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. మూడురోజులుగా ఆసుపత్రిలోనే ఉండి చికిత్స పొందుతున్నారు. తూప్రాన్ పట్టణానికి చెందిన 21 ఏళ్ల యువకుడు డెంగీ బారిన పడి మృత్యువాత పడ్డాడు. ఒక్కసారిగా అతను అనారోగ్యానికి గురికాగా, మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధులు పంజా విసురుతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో కలుషిత నీరు తాగడం, ఆహారం తినడం వల్ల ఈ దుస్థితి తలెత్తింది. ఎడతెరిపి లేకుండా వానలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించిన ప్రభుత్వం అప్రమత్తమై ఇంటింటి సర్వేకు ఆదేశించింది. పదిహేను రోజుల పాటు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వేయికి మందికి పైగా గుర్తించారు. లక్షణాలు ఎక్కువ ఉన్న చోట ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. మరో వైపు ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య సైతం పెరుగుతోంది. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం.

రోజుల తరబడి వర్షాలు కురవడంతో ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. దీంతో వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని గుర్తించగా, ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో గతనెల 15 నుంచి 31 వరకు ఇంటింటి సర్వే చేపట్టారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయా?లేవా అనే విషయమై ఆరా తీస్తూ వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లాలోని 21 మండలాలతో పాటు మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పట్టణాల్లో సర్వే కొనసాగింది. 400కు పైగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది బృందాలుగా ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించారు.

నిర్వహించిన శిబిరాలు 9

పరీక్షించిన వారి సంఖ్య 20,080

ఆసుపత్రికి పంపించిన వారి సంఖ్య 9

జ్వరం... అతిసారం...జిల్లాలో ఎక్కువ మంది జ్వరం, అతిసారంతో అస్వస్థతకు గురయ్యారని సర్వే ద్వారా తేలింది. చిలప్‌చెడ్ మండలం చిట్కూల్, నర్సాపూర్ మండలం ఆవంచ, కొల్చారం మండల కేంద్రంతో పాటు చిన్నఘనపూర్ తండా, నార్సింగిలోని జప్తిశివనూర్, పాపన్నపేట మండలం లక్ష్మినగర్, శివ్వంపేట మండలం ఉసిరికపల్లి, టేక్మాల్ మండలం ఎల్లుపేట్‌తో పాటు జిల్లా కేంద్రం మెదక్‌లోని ఆయా వార్డుల్లో వైద్యశిబిరాలు నిర్వహించి చికిత్స అందజేశారు. మందులను పంపిణీ చేశారు. తీవ్ర అస్వస్థతతకు గురయిన వారిని ఆసుపత్రులకు పంపించి వైద్యం అందించారు. ప్రారంభం నుంచే జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్, పీహెచ్‌సీ స్థాయిలో ర్యాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేశారు. కేసులు నమోదైన వెంటనే ఆయా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. కారణాలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

నర్సాపూర్‌లో కిటకిట

కాలానుగుణ వ్యాధులతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బాధితుల సంఖ్య అధికంగా ఉంటోంది. వర్షాలు, వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు సైతం అనారోగ్యానికి గురయ్యారు. నియోజకవర్గ, డివిజన్ కేంద్రమైన నర్సాపూర్‌లోని ఆసుపత్రికి నిత్యం 300 నుంచి 400 మంది వరకూ వస్తున్నారు. వీరిలో 50-100 మంది వరకూ వివిధ రోగాలతో చికిత్స పొందుతున్నారు. గ్రామాలు, తండాల్లో జ్వర పీడితులు ప్రతి ఇంట్లో ఉంటున్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలోని వార్డులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. నిత్యం ఆసుపత్రిలో వందమందికిపైగా చేరుతున్నారు. జులైలో 92మంది విషజ్వరాలు, 17 మంది టైఫాయిడ్ బారిన పడ్డారు.

పెరిగిన నిర్ధారణ పరీక్షలు...ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని వ్యాధి నిర్ధారణ కేంద్రంలో నమూనాలు పేరుకుపోతున్నాయి. రోజురోజుకు సంఖ్య పెరుగుతుండటంతో పరీక్షలు గణనీయంగా పెరిగాయి. రోజుకు 20-30 పరీక్షలు చేస్తుండగా 5-10 మందికి టైఫాయిడ్, 10-15 మందికి విషజ్వరాలు, మలేరియా, డయోరియా అని నివేదిక వస్తోంది. డెంగీ పరీక్షల నమూనాలను మెదక్‌కు తరలిస్తున్నారు. ఈ విషయాన్ని నర్సాపూర్ ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకులు మిర్జానజీంబేగ్ వద్ద ప్రస్తావించగా ఇటీవల కాలంలో విషజ్వరాలు, టైఫాయిడ్ కేసులు అధికంగా వస్తున్నాయని, ఎప్పటికప్పుడు తదనుగుణంగా వైద్య సేవలు అందిస్తూనే ఉన్నామని తెలిపారు. డెంగీ కేసు ఒకటి రాగా చికిత్స అందించామని, వ్యాధుల విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

దోమ తెరలను వాడాలి

వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల మండలాల్లో సర్వే చేయించాం. పలుప్రాంతాల్లో వైద్య శిబిరం నిర్వహించాం. తూప్రాన్‌లో డెంగీతో ఒకరు మరణిస్తే వైద్య సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఆరా తీశాం. ప్రజలకు అవగాహన కల్పించాం. పాతటైర్లు, పూలకుండీలు, కూలర్లలో నిల్వ ఉన్న నీళ్లను పారబోయాలి. దోమల నుంచి రక్షణ పొందేందుకు తెరలను వాడాలి. బయట ఆహారం తినవద్దు. దోమలు, ఈగలు వాలకుండా తగిన చర్యలు తీసుకోవాలి. - వేంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

# కరెంటు పోతే.. రక్తశుద్ధి ఆగాల్సిందే!

సంగారెడ్డి : దయాలసిస్ బాధితులను జహీరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో కరెంటు కష్టాలు వేధిస్తున్నాయి. రక్తశుద్ధికి ఇక్కడికి వస్తున్న బాధితులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రెండు నెలలుగా జనరేటర్ పనిచేయడం లేదు. ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. కరెంటు పోతే రక్తశుద్ధి మధ్యలోనే ఆపేయాల్సి వస్తోంది. రక్తాన్ని తిరిగి బాధితుల శరీరంలోకి పంపి... కరెంటు వచ్చాక మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ చేపట్టాల్సి వస్తోంది. దీంతో రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు.. గంటలకొద్దీ నిరీక్షించక తప్పడం లేదు. దీంతో దయాలసిస్ కోసం అక్కడికి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. నిత్యం వర్షాలు కురుస్తుండటం, గాలి బలంగా వీస్తుండటంతో తరచూ కరెంటు సరఫరాలో అవాంతరాలు తలెత్తుతున్నాయి. రోజులో కనీసం మూడు గంటల పాటు ఈ పరిస్థితి నెలకొంటోంది.



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

రక్తశుద్ధి యంత్రం విద్యుత్తు పోయినా దాదాపు 15నిమిషాల పాటు పనిచేస్తుంది. ఆ తర్వాత ఆగిపోతుంది. అప్పటికీ కరెంటు రాకపోతే పైపుల్లో ఉన్న రక్తం గడ్డకట్టుకు పోతుందని డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి నవీన్ తెలిపారు. అందుకే కరెంటు పోగానే రక్తాన్ని తిరిగి బాధితుడి శరీరంలోకి పంపించక తప్పడం లేదన్నారు. ఒకవేళ కొనసాగిస్తే..15 నిమిషాల తర్వాత.. విద్యుత్తు రాకపోతే వారి ఆరోగ్యంపై అది తీవ్ర ప్రభావం చూపుతుందనే కారణంతోనే ఇలా చేస్తున్నామన్నారు. ఇటీవల ఒక బాధితుడు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇక్కడికి వచ్చారు. తనవంతు వచ్చి రక్తశుద్ధి చేయించుకొని బయలుదేరేసరికి తెల్లవారుజాము 3.30 గంటలయింది. తరచూ కరెంటు పోవడమే కారణం.

రీఛార్జి బల్బులు కొనిపెట్టారు

ప్రస్తుతం జహీరాబాద్ ఆస్పత్రిలో 100 నుంచి 120 వరకు ఇన్‌పేషెంట్లు ఉంటారు ఒక్కోరోజు ఓపీ 900 దాటుతోంది. ఈస్థాయిలో రోగులు ఇక్కడికి వస్తున్నారు. ఐసీయూలో 10 పడకలున్నాయి. ఇక్కడా పూర్తి స్థాయిలో రోగులున్నారు. జనరేటర్ లేకపోవడంతో ఇన్వర్టర్ మీద ఆధారపడుతున్నారు. ఇది కొంత సమయమే పనిచేస్తోంది. దీంతో కరెంటు ఉన్నప్పుడు రీఛార్జి చేసుకొని సరఫరా ఆగగానే వెలిగే బల్బులు కొనుగోలు చేసి వాడుతున్నారు. కనీస వెలుతురు ఉండాలనే ఉద్దేశంతో ఇలా చేయక తప్పలేదని వైద్యులు వివరించారు.

రోజూ అయిదు షిఫ్టుల్లో..ఈ ఆస్పత్రిలో 46 మంది కిడ్నీ బాధితులు రక్తశుద్ధి చేయించుకోవడం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఇక్కడ ఏకకాలంలో అయిదు మందికి ఈ సేవ అందిస్తారు. ఇలా రోజూ అయిదు షిఫ్టుల్లో 25 మందికి రక్తశుద్ధి చేస్తున్నారు. ఒకసారి ఈ ప్రక్రియ పూర్తికావడానికి కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది. బయటకు వెళితే ఆర్థిక భారమని భావించి చాలా మంది ఇక్కడికే వస్తున్నారు. అలాంటి చోట కరెంటు పోతే... తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జనరేటర్ మరమ్మతుకు రూ.5లక్షలు అవుతాయని ప్రతిపాదించారు. ఇటీవల ఒక గుత్తేదారు దీంతో పాటు ఆస్పత్రిలో ఎలక్ట్రిక్ సమస్యలన్నీ తీర్చడానికి ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికీ పని మొదలుపెట్టలేదు.

త్వరలోనే మరమ్మతు చేస్తామన్నారు: డాక్టర్ శేషు, ఆస్పత్రి పర్యవేక్షకులు, జహీరాబాద్

రెండు నెలల క్రితం జనరేటర్ పాడయింది. ఉన్నతాధికారులకు ఇదే విషయాన్ని నివేదించాం. ఇటీవలే ఒక గుత్తేదారు సంబంధిత మరమ్మతులన్నీ చేసేందుకు వస్తారని సమాచారమిచ్చారు. ఇప్పటి వరకు రాలేదు. జనరేటర్ మరమ్మతులు పూర్తయితే ఈ సమస్య తప్పుతుంది. ఆక్సిజన్ ప్లాంటు నిర్వహణకు కూడా వారం రోజుల క్రితం ఒక కొత్త జనరేటర్‌ను ఇక్కడకు తెచ్చారు. ఇంకా దీనిని పూర్తిస్థాయిలో బిగించలేదు. దీనిని సిద్ధం చేస్తే ఆస్పత్రి అవసరాలకూ వాడుకోవచ్చు.

# సొరంగానికి సీపేజీ గండం

సిరిసిల్ల : కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులకు మూడేళ్లుగా సీపేజీ గండం వీడటం లేదు. ఇప్పటికే సొరంగం, మల్కపేట జలాశయం పనులు దాదాపు పూర్తయ్యాయి. పంపుహౌజ్‌లో మోటార్ల బిగింపు, సర్జ్‌పూల్‌లోని సివిల్, ఎలక్ట్రికల్ పనులు, జలాశయంలోకి పైపులైను నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీపేజీతో భారీగా నీరు చేరుతోంది. మోటార్లతో తోడుతున్నా తగ్గడం లేదు. వరుసగా రెండేళ్లు నీటిని తోడేందుకు దిల్లీకి చెందిన సంస్థ నుంచి మోటార్లు తెప్పించారు. మూడో ఏడాది అదే పరిస్థితి నెలకొంది. రెండేళ్లలో నీటిని తోడేందుకే సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాళేశ్వరం 9వ ప్యాకేజీలో సీపేజీ నీటితో మిగిలిన కొద్దిపాటి పనులు ముందుకు సాగడం లేదు. అన్నీ సక్రమంగా జరిగితే ఈ ఏడాది సెప్టెంబరులో ట్రయల్‌రన్ నిర్వహించాల్సి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పనులు నిలిచిపోయాయి. వర్షాలు, వరదలను ముందుగా గ్రహించిన అధికారులు రగుడు నుంచి మల్కపేట వరకు 20 మోటార్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సొరంగం ప్రారంభం రగుడు వద్ద అడ్డుగోడ కట్టారు. కాగా సిరిసిల్ల పట్టణంలోని వరద, మురుగు తుమ్మలకుంటకు పడిన గండితో అప్రోచ్ కాల్వ వద్దకు చేరుతున్నాయి. ఈ నీటిని తరలించడానికి అప్రోచ్ కాల్వకు గండి కొట్టారు. వరద నీరంతా అప్రోచ్ కాల్వ ద్వారా రాజరాజేశ్వర



జలాశయం బ్యాక్‌వాటర్‌లో కలుస్తోంది. కాల్వ పైకి ఉండటం, సొరంగం దిగువకు ఉండటంతోపాటు రగుడు, చంద్రంపేట, కొలనూరు, ధర్మారం గ్రామాల్లోని చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. దీంతో సీపేజీ ఎక్కువవుతోంది. మోటార్లతో తొలగించినా సీపేజీ తగ్గడం లేదు. మూడేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది.

అప్రోచ్ కాల్వ గండి మూస్తేనే...సిరిసిల్ల పట్టణంలోని వరద నీటిని కొత్తచెరువు నుంచి మళ్లించేందుకు పురపాలకశాఖ అధికారులు శాంతినగర్, శ్రీనగర్ కాలనీల మీదుగా మట్టి కాల్వలను తవ్వించారు. ఈ నీరంతా బైపాస్ మీదుగా తుమ్మలకుంటలోకి చేరుతోంది. దీనికి గండి పడటంతో కరకట్ట వద్ద భారీగా నీరు నిలిచింది. గతేడాది ప్రత్యామ్నాయంగా 9వ ప్యాకేజీ అప్రోచ్ కాల్వకు గండికొట్టడంతో పట్టణానికి ముంపు తప్పింది. ఈ ఏడాది గండి అలాగే ఉండటంతో వరదల నుంచి పట్టణ ప్రజలు గట్టెక్కారు. కానీ దీంతో కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులకు ఆటంకంగా మారాయి. గండి పూడ్చితే తప్పా సొరంగం, పంపుహౌజ్ పనులు ముందుకు సాగేలా లేవు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు 90 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. పనుల ఆలస్యంతో మెట్టప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరడానికి ఎదురుచూపులు తప్పడం లేదు.

పర్యవేక్షణ ఎలా?

కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఈఈకి ఇటీవల జిల్లా జలవనరుల శాఖ సాంకేతిక విభాగం బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్యాకేజీ, అదనపు ఎత్తిపోతల పనుల పర్యవేక్షణ లోపించింది. మూడేళ్లుగా ఇప్పుడు.. అప్పుడు అంటూ వాయిదాలతోనే కాలం గడిచిపోతోంది. సొరంగం లైనింగ్ చివరి దశలో ఉంది. ఇటు మల్కపేట వద్ద సర్జ్‌పూల్‌లో మోటార్లు బిగించే దశలో ఉన్నాయి. మల్కపేట జలాశయంలో ఒక్క టీఎంసీ నీటిని నింపి సామర్థ్యం పరీక్షకే మూణ్నెళ్ల సమయం పడుతుంది. అక్కడి నుంచి సింగసముద్రం వరకు కాల్వల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. బట్టలచెరువు పనులు జరుగుతున్నాయి. అక్కడి నుంచి ఎగువమానేరు వరకు పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి. ఈ పనులన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇలానే కొనసాగితే ఈ ఏడాది కూడా ఎగువ మానేరుకు నీటిని తరలించే పరిస్థితులు కనిపించడం లేదు.

ప్యాకేజీ స్వరూపం?

వ్యయం: రూ.1,383.32 కోట్లు

నీటిని ఎత్తిపోసే సామర్థ్యం: 120 రోజుల్లో 11.63 టీఎంసీలు

ప్యాకేజీ పొడవు: 32 కిలోమీటర్లు (రాజరాజేశ్వర నుంచి ఎగువమానేరు)

ప్రధాన జలాశయాలు: మల్కపేట, బట్టలచెరువు, అదనపు ఎత్తిపోతలు నిమ్మపల్లి జలాశయం

# నిఘా... మరింత పటిష్ఠం

వేములవాడ : దక్షిణకాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి భద్రత చర్యలు మరింత పెరిగాయి. సీసీ కెమెరాలతో నిఘాను ఆలయ అధికారులు, పోలీస్‌శాఖ తీవ్రం చేసింది. ప్రతి నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులతో కిటకిటలాడే రాజన్న ఆలయంలో ఎలాంటి చిన్న సంఘటన జరిగిన క్షణాల్లో ఛేదించే విధంగా సీసీ కెమెరాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తాజాగా ఆలయ ప్రధాన ప్రాంతాలను హైదరాబాద్‌లోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. దీంతో అక్కడి నుంచే పర్యవేక్షించనున్నారు. వేములవాడ ఆలయంలోని ప్రధాన ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు, అక్కడి నుంచి వేములవాడ పట్టణ ఠాణాకు అనుసంధానం చేశారు. దీంతో రాజన్న క్షేత్రంలో జరిగే ప్రతి సంఘటనపై పోలీసుల నిఘా ఉంటుంది. ఆలయంలో ముఖ్యమైన ప్రాంతాలు ఏవి అనే విషయమై ఇటీవల పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతర్గత భద్రత పరంగా పలు ప్రాంతాలను గుర్తించారు. సీసీ కెమెరాల అనుసంధానానికి చర్యలు చేపట్టారు. ఇందులో ఆలయ ప్రధాన ద్వారం, గర్భగుడి, భక్తులు రద్దీ అధికంగా ఉండే ప్రధాన ఆలయ ప్రాంతం, కోడె మొక్కులు, క్యూలైన్లు, కల్యాణకట్ట తదితర ప్రాంతాలను గుర్తించి అనుసంధానం చేశారు. ప్రధాన ఆలయంలోని దాదాపు 25 సీసీ కెమెరాల్లో ప్రస్తుతం 12 సీసీ కెమెరాలను హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించారు. తరవాత పూర్తి స్థాయిలో అనుసంధానించనున్నారు.

చాలా గొప్ప విషయం - రమాదేవి, ఈవో, రాజన్న ఆలయం

హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూంకు రాజన్న ఆలయంలోని సీసీ కెమెరాలను అనుసంధానం చేయడంతో భద్రత మరింత పెరుగుతుంది. ఇప్పటికే ఆలయంలో భద్రత పరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నాయి. కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయడం చాలా గొప్ప విషయం. సీసీ కెమెరాలు ఆలయంలో ప్రధానంగా పని చేస్తున్నాయి. మరిన్ని కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం.

భద్రత మరింత కట్టుదిట్టం

ఆలయంలో భద్రత పరంగా ఇప్పటికే నిఘా కట్టుదిట్టంగా పని చేస్తోంది. ఆలయం లోపల, పరిసరాల్లో ఎలాంటి చిన్న సంఘటన జరిగిన గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించడానికి సీసీ కెమెరాలు దోహదం చేస్తున్నాయి. ఇటీవల ఆలయ మెట్ల ప్రాంతం వద్ద ఓ చిన్నారి అపహరణకు గురి కాగా వేములవాడ పట్టణ పోలీసులు ఆలయ సీసీ పుటేజీల ఆధారంగా గంటల వ్యవధిలో ఛేదించారు.




విశాఖపట్నం: వైకాపా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబసభ్యులు కిడ్నాప్ అయ్యారు. ఎంపీ భార్య జ్యోతి, కుమారుడు చందుతో పాటు ఆ కుటుంబానికి సన్నిహితుడు, ఆడిటర్, వైకాపా నేత గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ)ను కొందరు అపహరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీల నేపథ్యంలోనే కిడ్నాప్ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎంపీ ప్రస్తుతం నగరంలో లేరని.. ఈ క్రమంలో ఆనందపురంలోని కుమారుడి వద్దకు ఆయన భార్య వెళ్లే సమయంలో ఈ కిడ్నాప్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమాచారం తెలిసి జీవీ అక్కడికి వెళ్లడంతో ఆయన్ను కూడా అపహరించినట్లు తెలుస్తోంది. వారందరినీ అక్కడే ఓ ఇంట్లో నిర్బంధించినట్లు సమాచారం. బుధవారం జరిగిన ఈ ఘటనను పోలీసులు గోప్యంగా ఉంచి దర్యాప్తు చేసినట్లు తెలుస్తోంది. విషయం బయటకు రావడంతో పోలీసులు స్పందించారు. ఎంపీ కుటుంబసభ్యులు, ఆడిటర్ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారని తెలిపారు. కిడ్నాపర్ల వివరాలను వెల్లడిస్తామని చెబుతున్నారు. నిందితులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

## యూ-1 జోన్‌పై ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట తప్పారు: రైతులు

అమరావతి: యూ-1 జోన్ విషయంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట తప్పారని రైతులు ఆక్షేపించారు. ఫీజులు లేకుండా జోన్‌ను రద్దు చేస్తామని గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు సీఆర్‌డీఏ మళ్లీ ఫీజు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ మరోసారి రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

**అధికారంలోకి రాగానే యూ-1 జోన్ రద్దు: నారా లోకేశ్ –** మాట మార్చడం, మడప తిప్పడంలో వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. సీఎం జగన్‌ను మించిపోయారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా యూ-1 జోన్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి తాడేపల్లి రైతుల్ని మోసం చేశారని ఆరోపించారు. తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేకుండానే యూ-1 జోన్‌ను రద్దు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.


రైతుల నిరసన (పాతచిత్రం)

## ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు జగన్ సర్కార్ తుంగలో తొక్కింది



విజయవాడ: కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణలో భాగంగా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించే విధానాన్ని విరమించుకోవాలని సీపీఐ నేత రామకృష్ణ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటులను వ్యతిరేకిస్తూ ఆల్ పార్టీ లీడర్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానాలను తుంగలో తొక్కి విద్యుత్ ఛార్జింగ్ పెంచుతూ ప్రజలపై పెను భారం మోపుతోందని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వస్తే 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు రానున్న కాలంలో కరెంటు పెంచమని నమ్మబలికారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు కరెంటు చార్జీలను పెంచిందని మండిపడ్డారు.

ప్రభుత్వం తక్షణం ట్రూ అప్ చార్జీలు, సబ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దుచేసి, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై ఆల్ పార్టీ లీడర్స్ నిర్ణయం తీసుకుంటామని రామకృష్ణ పేర్కొన్నారు.

## పవన్ ఒక చెప్పు చూపిస్తే.. నేను రెండు చెప్పులు చూపిస్తా: పేర్ని నాని

తాడేపల్లి: నారాహిగా పెట్టుకోవాల్సిన వాహనం పేరును వారాహిగా పవన్ పెట్టుకున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ, పవన్ పూటకొక మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రోజుకొక డైలాగ్ చెప్పి పవన్ వ్యూహం అంటారు. చంద్రబాబు బాగుండటం కోసం పవన్ ఏదైనా చేస్తాడని మండిపడ్డారు. "చంద్రబాబు చొక్కా పట్టుకొని పవన్ ఏనాడైనా నిలదీశారా?. పవన్ ఆఫీసులో కూర్చొని సినిమా డైలాగ్‌లు, సొల్లు కబుర్లు చెబుతాడు. పవన్ ఒక చెప్పు చూపిస్తే.. నేను రెండు చెప్పులు చూపిస్తాను.. పవన్‌ను అడ్డం పెట్టి జనసేన పార్టీని చంద్రబాబు నడుపుతున్నారు. చంద్రబాబు, పవన్, బీజేపీ కలిసి ప్రభుత్వం నడిపినప్పుడు సొంత డబ్బు ఖర్చుపెట్టారా?. పవన్ ప్రతి సినిమా రిలీజ్ ముందు కేసీఆర్ కాళ్లు మొక్కుతాడు.

గులాబీ జెండాను వెనక జేబులో పెట్టుకొని తిరుగుతున్న దెవరు?" అంటూ పేర్ని నాని నిప్పులు చెరిగారు. "హరీష్‌రావు ఆంధ్రరాష్ట్రాన్ని తిడుతుంటే పవన్ ఏం చేస్తున్నారు?. జగన్ సీఎం అయినప్పటి నుంచి పవన్ ఒక్క సినిమా అయినా ఆగిందా?. పవన్, బీజేపీ, టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సినిమా టికెట్లపై జీఎస్టీ వేసారా? లేదా?. సీఎం పదవి అనేది ఎవరో దానం చేస్తే వచ్చేది కాదు.. పవన్ డ్రామాలు వేస్తే మక్కెలిరగదీస్తాం" అంటూ పేర్ని నాని మండిపడ్డారు.







అహ్మదాబాద్: బిపోర్ జాయ్ తుపాను ముంచుకొస్తోంది. అత్యంత భీకరంగా మారిన బిపోర్ జాయ్ తీరాన్ని దాటనుంది. కచ్ సమీపంలోని మాండ్వి-పాక్‌లోని జఖౌ మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను తీరం దాటేవేళ గంటకు 150 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయని హెచ్చరించింది. దాంతో గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువనున్నాయి. ఇక సౌరాష్ట్ర, కచ్ తీరాల్లో సాయంత్రం వరకు సముద్రం కల్లోలంగా ఉండనుంది.

**74 వేల మంది తరలింపు..** ప్రస్తుతం తుపాను గుజరాత్ తీరానికి 200 కి.మీ లోపు దూరంలోనే ఉందని అధికారులు వెల్లడించారు. ఇది స్వల్పంగా బలహీనపడినా గుజరాత్‌కు ముప్పు పొంచే ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర బుధవారం దిల్లీలో మీడియాకు వెల్లడించారు. ఈ తుపాను ముప్పుతో గుజరాత్ తీర ప్రాంతాల్లోని సుమారు 74వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన వాటిలో ఎక్కువ కాలం కొనసాగనున్న తుపానుగా బిపోర్‌జాయ్ నిలవనుంది.

జూన్ ఆరు ఇ ది ఏర్పడింది. తీరాన్ని తాకిన తర్వాత కూడా ఇది మరికొన్ని రోజులు ఉనికిలో ఉంటుంది. ఇక తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సమీప ప్రాంతాల్లో 144 సెక్షన్‌లో అమల్లో ఉంచారు. ఆలయాలు, కార్యాలయాలు, పాఠశాలలు మూసివేశారు. తీర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు.

**8 రాష్ట్రాల్లో వర్షాలు..** బిపోర్ జాయ్ తుపాను ప్రభావంతో గుజరాత్‌తో పాటు మరో 8 రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీంతో కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలతోపాటు దమణ్ దీవ్, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తమయ్యాయి. ఇక తుపాను నేపథ్యంలో పాకిస్థాన్‌లోని తీర ప్రాంత పట్టణాలు, అరేబియా ద్వీప దేశాల్లో ముందుజాగ్రత్త చర్యలు తీసుకొన్నారు.

## దళితులంటే జగన్‌కి ఎందుకంత చులకన: బీటెక్ రవి

పులివెందుల: సీఎం జగన్ సొంత నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకుండా పోయిందని తెదేపా నేత బీటెక్ రవి ధ్వజమెత్తారు. దళితుడు జంధ్యాల కృష్ణయ్య హత్య అతి దుర్మార్గమని.. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. సొంత నియోజకవర్గంలోనే దళితులపై దౌర్జన్యాలు జరుగుతుంటే సీఎం చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. దళితులంటే జగన్‌కి ఎందుకంత చులకన అని నిలదీశారు. సొంత నియోజకవర్గంలో శాంతిభద్రతలు కాపాడలేని వ్యక్తి ఇక రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారని దుయ్యబట్టారు. మృతుడు కృష్ణయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బీటెక్ రవి డిమాండ్ చేశారు.



## 'జనవాణి' చేపట్టడానికి ఆ చెల్లెలు ఆవేదనే కారణం: పవన్ కల్యాణ్



పిఠాపురం: చైతన్యంతో ఉన్న ప్రజలు ప్రజాస్వామ్యంలో పాల్గొనకపోతే.. అరాచకం రాజ్యమేలుతుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలులో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 34 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. బాధల్లో, కష్టాల్లో ఉన్న వారి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటే మరిన్ని విషయాలు బయటికొస్తాయన్నారు. "గతంలో సీఎం నివాసం ఉండే తాడేపల్లి ప్రాంతంలో ఓ మహిళ నా దగ్గరికి వచ్చి సమస్య చెప్పుకొంది. నాకు అర్జీ ఇచ్చిన కొద్ది రోజులకే మహిళ అన్నని కిడ్నాప్ చేశారు. నాలుగు రోజుల తర్వాత శవాన్ని తీసుకొచ్చారు. కష్టం చెప్పుకోవడానికి నా దగ్గరకు వచ్చిన అబ్బాయిని అన్యాయంగా చంపేశారు. ఆ తర్వాత మళ్లీ ఆ యువతి నా దగ్గరికి వచ్చి జరిగిన విషయం చెప్పింది. ఆ చెల్లెలు ఆవేదనే జనవాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టేలా చేసింది. సరైన మాస్కులు లేవని చెప్పినందుకు విశాఖలో డాక్టర్ సుధాకర్‌పై పిచ్చోడిగా ముద్ర వేసి చనిపోయేలా చేశారు. కొద్ది రోజుల క్రితం ఓ దివ్యాంగురాలిని తీసుకెళ్లి మానసిక స్థితి బాగోలేదని కాకినాడ ఆసుపత్రిలో పడేశారు. ఎవరు ఎదురొచ్చినా సరే చాలా పకడ్బందీగా వ్యవస్థల్ని వాడుకొని వారిని ఎలా భయపెట్టాలనే చూస్తున్నారు. ఇది చాలా ఆవేదన కలిగించింది. దీన్ని ఎదుర్కొనేందుకే జనసేన 'జనవాణి' కార్యక్రమం చేపట్టింది. ఈ రోజు జనవాణి కార్యక్రమంలో 34 ఫిర్యాదులు స్వీకరించాం.

రిజర్వాయర్ల సమస్య మొదలు.. కాలువల ఆధునికీకరణ, స్థలాలు కబ్జా, అక్రమంగా చెరువుల్లో మట్టి తవ్వకాలు తదితర సమస్యలపై ప్రధానంగా ఫిర్యాదులు అందాయి. అన్ని నియోజకవర్గాల్లో తిరిగి సమస్యలు తెలుసుకుంటాం.

నా ఉద్దేశం.. నా ఆలోచన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలి. వైకాపా నాయకులు తిడుతున్నారంటే.. తిట్టనివ్వండి. పాకిస్థాన్ బోర్డర్‌లోకి వెళ్లి గుర్రం మీద దౌడ్ చేసుకోమనండి అప్పుడు మొనగాడు ఎవరో తెలుస్తుంది. మాటకు ఎదురు చెప్పడాలు మా దగ్గర ఉండవు. ఏదైనా చేతలతో చూపిస్తాం. తొడలు కొట్టడాలు, మీసాలు తిప్పడాలు నేను సినిమాలోనే చెయ్యను" అని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పలువురు పార్టీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.




**నివేదిక సమర్పించిన దిల్లీ పోలీసులు :** లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటోన్న భాజపా ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై గురువారం దిల్లీ పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే ఆయనపై పోక్సో కేసును తొలగించాలని కోరుతూ పాటియాలా హౌస్ కోర్టుకు నివేదికను సమర్పించారు. ఆ కేసును ధ్రువీకరించే సాక్ష్యాలు లేకపోవడంతో పోలీసులు ఈ విధంగా పేర్కొన్నారు. ఈ మేరకు దాదాపు 500 పేజీల నివేదికను కోర్టుకు అందజేశారు. దీనిపై జులై 4వ తేదీన విచారణ జరగనుంది.

## ఒలింపిక్స్‌లో జూదం నిర్వహిస్తే ఏపీ అగ్రస్థానంలో ఉంటుందేమో... టీడీపీ నేత యెద్దేవా



పల్నాడు: జూదంలేని రాష్ట్రంగా చేశామని అసెంబ్లీలో సీఎం జగన్ ప్రగల్భాలు పలికారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఈరోజు ఒలింపిక్స్‌లో జూదం నిర్వహిస్తే ఏపీ అగ్రస్థానంలో ఉంటుందని యెద్దేవా చేశారు. 29 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్‌గా నిలిచే అవకాశం ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ క్లబ్‌లను మాత్రం మూసేశారన్నారు. అనధికారికంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా పేకాట క్లబ్‌లు నడుస్తున్నాయని ఆరోపించారు. చిలకలూరిపేట పేకాటకు అడ్డాగా మారిందన్నారు. చిలకలూరిపేటలోని అపార్ట్‌మెంట్లలో జోరుగా జూదం నడుస్తుందని అన్నారు. సగటును రోజుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు సంపాదిస్తున్నారని తెలిపారు. పేకాట క్లబ్‌లోనే మద్యం సహా అన్నీ సరఫరా చేస్తున్నారన్నారు. కంటిచూపు మేరలో ఉన్న చిలకలూరిపేటలో జరిగేది సీఎంకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. సీనియర్ సిటిజన్స్ ఆడుకునే క్లబ్‌లు మూసేసి అనధికారికంగా పేకాట క్లబ్‌లు తెరిచారన్నారు. పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని.. మహిళల తాళిబొట్లు తెగిపోతున్నాయని అన్నారు. సీఎం జగన్, మంత్రి విడదల రజని పుణ్యాన ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నారు. విడదల రజని మహిళా మంత్రిగా ఉండి మహిళల తాళిబొట్లు తెంచుతున్నారని ప్రత్తిపాటి పుల్లారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఆల్ పార్టీ సమావేశంలో నిలిచిన కరెంట్.. వైసీపీపై మండిపడ్డ బోండా ఉమా



విజయవాడ: నగరంలోని పెరిగిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ ఏర్పాటు చేసిన ఆల్‌పార్టీ మీటింగ్‌లో వైసీపీ నేతలు కరెంట్ తీసేశారని టీడీపీ నేత బోండా ఉమా విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటులను వ్యతిరేకిస్తూ ఆల్ పార్టీ లీడర్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని... అయితే సమావేశం ప్రారంభం అవ్వగానే ట్రాన్స్ఫార్మర్ పేలిపోయి కరెంటు పోయిందని అన్నారు. ఇది వైసీపీ నేతల పనేనని తమకు తెలుసన్నారు. మీటింగ్ నిర్వహించుకుంటున్నామని తెలిసి కరెంటు తీసేశారని.. కిందకి దిగేలోపు కారులో గాలి తీసేసిన ఆశ్చర్యపోక్కర్లేదని వ్యాఖ్యలు చేశారు. కరెంటు బిల్లుల పేరుతో ప్రజలపై పెను భారాన్ని విధిస్తున్నారని మండిపడ్డారు. కరెంటు బిల్లులతో పాటు ట్రూఅప్ చార్జీలు విధించడం ఈ ప్రభుత్వం దుర్మార్గపు చర్య అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి కరెంటు బిల్లు మరింత ఎక్కువ వచ్చేలాగా దుర్మార్గ చర్యకు పాల్పడుతోందన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేసి, స్మార్ట్ మీటర్లను పెట్టకుండా అడ్డుపడేలాగా చర్యలు తీసుకునేందుకు ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని బోండా ఉమా పేర్కొన్నారు.

## కోడికత్తి కేసులో ట్విస్ట్.. సీజేఐకి లేఖ రాసిన శ్రీను



విజయవాడ : యన్ఐఏ కోర్టులో నేడు కోడి కత్తి కేసు విచారణ జరిగింది. ఈ సందర్భంగా కోర్టుకు కోడి కత్తి శ్రీను, ఇరు పక్షాల న్యాయవాదులు హాజరయ్యారు. అయితే ఈ కేసులో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. తనకు జైలు నుంచి విముక్తి కలిగించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కోడికత్తి కేసులో నిందితుడు జన్నుపల్లి శ్రీనివాస్ లేఖ రాశాడు. శ్రీను లేఖలో ఏం రాశాడంటే.. "1610 రోజులుగా బెయిల్ లేకుండా జైలులోనే ఉంటున్నా. నేను ఇంకా ఎంత కాలం జైలులో ఉండాలో తెలియడం లేదు. విముక్తి కలిగించండి. నాపై నమోదు అయిన కేసును జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ విచారించి న్యాయం చేయాలి. నాకు న్యాయం చేయాలని అనేక మార్లు కోర్ట కు విన్నవించా. అయినా స్పందన లేకపోవడంతో మీకు (సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి) లేఖ రాస్తున్నా" అని పేర్కొన్నాడు. ఇక లేఖ విషయమై శ్రీను తరుఫు న్యాయవాది అబ్దుస్ సలీం మాట్లాడుతూ.. తెలుగులో రాసిన శ్రీను లేఖను ఇంగ్లీషులోకి అనువాదం చేసి పంపిస్తున్నాం. అతని తల్లి సావిత్రి ఇంతకముందు ఆ సమయంలో సీజేఐగా ఉన్న ఎన్వీ రమణ కు ఇదే విషయంపై లేఖ రాశారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ కోర్టు కు పది కిలో మీటర్ల దూరంలో నివాసం ఉన్నారు. పదిహేను నిమిషాలు కేటాయిస్తే సాక్ష్యం చెప్పి వెళ్లవచ్చు. ఉద్దేశపూర్వకంగా ఆయన తన న్యాయవాదులతో పిటీషన్లు వేయించారు. ఎటువంటి కుట్ర కోణం లేదని ఎన్ఐఏ అధికారులు స్పష్టం చేశారు. అయినా కొత్తగా పిటిషన్ వేయడం వెనుక వేరే కారణాలు ఉన్నాయి. ఇక ప్రతి రోజూ విచారణ వేగవంతం చేసి కేసు ముగింపు పలకాలి. కాదంటే సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం కోరతాం" అని తెలిపారు.

## నటి కాకపోతే జాన్వీ సంచార జీవితం!

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా తెరంగేట్రం చేసిన జాన్వీకపూర్ కెరీర్ బాలీవుడ్ లో దేదీప్యమానంగా సాగిపోతుంది. యువ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా రాణిస్తుంది. బయోపిక్ ల్లో సైతం నటిస్తూ సత్తా చాటుతుంది. ఇటీవలే టాలీవుడ్ లో నూ లాంచ్ అయింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమా తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. నిజ జీవితంలో జాన్వీ ఊహించిందే. తల్లి అగ్ర తారగా కొనసాగారు. తండ్రి పెద్ద నిర్మాత. అలాంటి బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చే వారసులు తప్పకుండా నటులే అవుతారని ఎవరైనా ఊహిస్తారు. దాదాపు అలాంటి వారి అందరి జీవితాలు తాము కొరుకున్న విధంగానే ఉంటాయి. అయితే ఒకవేళ జాన్వీ నటికాకపోతే మరో ఆప్షన్ ఏదైనా పెట్టుకుందా? అంటే అవుననే అంటుంది. జాన్వీ నటికాకపోతే ప్రపంచమంతా సంచారిలో చుట్టేసిదిట. సంచార జీవితం అంటే ఎంతో ఇష్టమట. నటి కాకపోతే ప్రపంచం చుట్టేసి కొత్త



వ్యక్తుల్ని కలుసుకునే దాన్ని. అదీ కుదరకపోతే రచయిత్రి అయ్యే దాన్ని అని తెలిపింది. సంచార జీవితం అన్నది సాహసంతో కూడుకున్నది. ప్రపంచాన్ని సాధారణంగా చుట్టేయడం వేరు. అడ్వెంచర్స్ గా మలుచుకోవడం వేరు. ఇక్కడ కూడా జాన్వీ అడ్వెంచర్ గానే ప్రయాణం సాగించడాన్ని ఇష్టపడింది. ఎక్కువగా ప్రకృతితో గడపాలని ఇష్టపడుతుందిట. వాయు కాలుష్యానికి దూరంగా చుట్టూ పచ్చిన వాతావరణ ఉంటే ఎంతో ఇష్టమట. అందుకోసం ఎక్కువగా మాల్దీవులకు వెళ్తుందిట. అలాగే ప్రశాంతత కోసం మూడు నెలలకు ఒకసారైనా తిరుపతి శ్రీవారి దర్శనం చేసుకుంటుందిట. మొత్తానికి అమ్మడిలో కొన్ని మంచి క్వాలిటీలు ఉన్నాయని తెలుస్తోంది. ఇలా ప్రపంచాన్ని చుట్టేయడం అంటే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ కి ఎంతో ఇష్టం. ఖాళీగా ఉంటే బ్యాగేసుకుని ప్రపంచ దేశాలన్ని చుట్టడం ఆయనకు అలవాటు. ఆ అలవాటు నుంచి పుట్టిందే హార్ట్ ఎటాక్ లో నితిన్ క్యారెక్టర్. ఆ సినిమా ప్రచార సమయంలోనే పూరికి ప్రపంచ యాత్ర చేయాలని ఉందన్న విషయాన్ని రివీల్ చేసారు. కొత్త అన్వేషణలు అంటే ఆయనకు ఎంతో ఇష్టం.

## రెండు బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టి ఫోటోలకి పరిమితమైన హీరోయిన్..!

కన్నడ సెన్సేషనల్ మూవీ కె.జి.ఎఫ్ తో వెండితెరకు పరిచయమైంది శ్రీనిధి శెట్టి. మొదటి సినిమానే హిస్టరీ క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఆ సినిమా సీక్వెల్ లో కూడా అమ్మడు భాగమైంది. కె.జి.ఎఫ్ 1 2 సినిమాల హిట్లకు తను కూడా భాగమైంది. అయితే అంత పెద్ద హిట్లు కొట్టిన శ్రీనిధి కెరీర్ లో ఆ దూకుడు చూపించట్లేదని చెప్పొచ్చు. కె.జి.ఎఫ్ 2 తర్వాత విక్రం తో కోబ్రా సినిమా చేసింది శ్రీనిధి కానీ ఆ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో అమ్మడు సైలెంట్ అయ్యింది. ఎంట్రీ గ్రాండ్ గా ఇచ్చినా తర్వాత సినిమాల విషయంలో కన్ ఫ్యూజ్ అవుతుంది శ్రీనిధి. అంతేకాదు తన దగ్గరకు వచ్చిన నిర్మాతలకు రెమ్యునరేషన్ పరంగా కూడా ఎక్కువ అడిగి షాక్ ఇస్తుందట. శ్రీనిధి ఇదంతా తెలిసి చేస్తుందా లేక తెలియక చేస్తుందా అన్నది చెప్పడం



కష్టం. సినిమాలు చేయకుండా ఫోటో షూట్స్ తో కాలం వెళ్లదీస్తుంది అమ్మడు. కె.జి.ఎఫ్ లాంటి సినిమా చేసిన హీరోయిన్ వరుసగా ఐదారు సినిమాలతో బిజీగా ఉంటుందని అనుకుంటే ఇలా ఖాళీగా ఉంటూ ఫోటోలు షేర్ చేస్తుంది. కెరీర్ గైడెన్స్ లో ఆమెకు ఎవరు సపోర్ట్ గా నిలవట్లేదా ఏంటో కానీ శ్రీనిధి క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలని తెలియట్లేదు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరిగినా అమ్మడికి నచ్చలేదో లేక ఏమైందో కానీ ఆ అవకాశాలను మిస్ చేసుకుందట. కోబ్రా తర్వాత శ్రీనిధి మరే సినిమాకు సైన్ చేయలేదు. అయితే ఆడియన్స్ కు మాత్రం తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది. సినిమాలు చేయాలి కానీ ఇలా ఫోటో షూట్స్ ఎంత చేసినా ఏం లాభమని కొందరు అంటున్నారు. జీరో సైజ్ పర్ఫెక్ట్ అవుట్ ఫిట్ తో కుర్రాళ్ల హృదయాలను గాయం చేస్తున్న శ్రీనిధి వరుస సినిమాలు చేస్తే ఎంకరేజ్ చేసేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. సినిమాల విషయంలో అమ్మడు సీరియస్ గా ఉంటే బెటర్ ఇలా సైలెంట్ గా ఉంటే ఫేడవుట్ అయ్యే ఛాన్స్ కూడా ఉంటుంది.




## జాన్వీ సిస్టర్స్ కౌగిలిలో కుర్రాడు



దివంగత నటి శ్రీదేవి ఇద్దరు కూతుళ్లలో ఒకరైన జాన్వీ కపూర్ ఇప్పటికే బాలీవుడ్లో హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకుంది. త్వరలోనే టాలీవుడ్కు పరిచయం కానుంది. మరోవైపు శ్రీదేవి రెండో కూతురు ఖుషి కపూర్ సైతం బీటౌన్ ఎంట్రీకి సిద్ధమవుతోంది. సినిమాల్లోకి రాకముందే ఖుషీ తన ఫోటోలతో సోషల్ మీడియాలో అందరినీ అలరిస్తూనే ఉంది. కాగా జాన్వీ కపూర్ సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా తన సోదరి ఖుషీతో కూడా సమయం గడుపుతూ ఉంటుంది. తాజాగా తన చెల్లెలు ఖుషీ తో కలిసి ఫ్రెండ్స్ తో పార్టీకి వెళ్లింది. ఇద్దరూ కలిసి స్నేహితులు ఫ్యామిలీ ఫ్రెండ్స్ తో కలిసి సరదాగా గడిపారు. దానికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. ముఖ్యంగా వాటిలో వీరిద్దరూ కలిసి ఒక అబ్బాయిని హగ్ చేసుకోవడం విశేషం.

ఒకవేళ అతను వారి క్లోజ్ ఫ్రెండ్ అయ్యి ఉండొచ్చు. ఇక ఈ ఫోటోల్లో జాన్వీ బ్లాక్ కరల్ స్లీవ్ లెస్ టాప్ కింద బ్లూ షార్ట్ ధరించి ఉంది. ఇక ఖుషీ బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ మినీ టైట్ డ్రెస్ ధరించింది. ఇద్దరూ చాలా హాట్ గా కనిపిస్తున్నారు. ఏదో పబ్ లో లేదంటే ఏదైనా ప్రైవేట్ పార్టీలో దిగిన ఫోటోల్లా కనిపిస్తున్నాయి. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. ఫ్యాన్స్ కి ఈ ఫోటోలు విపరీతంగా నచ్చేశాయి. ఇద్దరూ చాలా హాట్ గా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ ముద్దుగుమ్మల కెరీర్ విషయానికి వస్తే జాన్వీ ఇప్పటికే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ రేంజ్ కి ఎదుగుతోంది. హీరో పక్కన రోల్స్ కాకుండా నటకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. ఫలితం పట్టించుకోకుండా వరసగా చేసుకుంటూ పోతోంది. మూవీలు హిట్ కాకున్నా జాన్వీ నటనకు మాత్రం అందరూ ఫిదా అయిపోతున్నారు. ఇక రీసెంట్గా జూనియర్ ఎన్టీఆర్కు జంటగా 'దేవర' సినిమాకు సైన్ చేసింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటుండగా.. ఈ జంట ఆన్‌స్క్రీన్ ఏ విధంగా ఉంటుందో చూసేందుకు ఫ్యాన్స్ ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఈ చిత్రం విజయం సాధిస్తే.. తను తెలుగులో మరిన్ని సినిమాలకు సైన్ చేసే అవకాశముంది. ఇక ఖుషీ తన బాలీవుడ్ లాంచింగ్ కి రెడీ అవుతోంది. తన ఎంట్రీకి సరిపోయే మూవీ స్టోరీ కోసం ఆమె ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

## టిల్లుతో మెగాస్టార్ కిరికిరి.. అట్లుంటది మరి!!




సినిమా రంగం అనగానే ఒక హీరోతో మరో హీరో పోటీపడటం సర్వ సాధారణం. ముఖ్యంగా సినిమా విడుదల సమయంలో ఒకే రోజు డేట్ ఫిక్స్ చేసుకొని చాలా మంది హీరోలు తలపడుతూ ఉంటారు. సంక్రాంతి దసరా దీపావళి ఇలాంటి పండగ సమయంలో పోటీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే పండగ సమయంలో ప్రేక్షులు హాలీడేలో ఉంటారు కాబట్టి తమ సినిమాకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని కాసుల వర్షం కురుస్తుందని నమ్ముతుంటారు. ఇప్పటి వరకు పెద్ద పెద్ద హీరోలు కూడా అలా పోటీపడ్డారు. లేదంటే ఎవరైనా పెద్ద హీరో సినిమా ఉందంటే చిన్న హీరోలు మాకెందుకులే అని కాస్త ఆగుతారు. కానీ తాజాగా టాలీవుడ్ లో ఇంట్రస్టింగ్ ఫైట్ త్వరలో ఉండబోతోంది. అది మెగాస్టార్ చిరంజీవితో యువ హీరో సిద్ధు జొన్నలగొట్ట తలపడబోతున్నాడు. అసలు విషయానికి వస్తే చాలా కాలం తర్వాత మెగాస్టార్ ఖాతాలో వాల్తేరు వీరయ్యతో హిట్ పడింది. నిజానికి ఆ సినిమా కూడా కొత్త కథేమీ కాదు. కానీ చిరంజీవిని బాబీ ఛూపించిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. చిరు ఖాతాలో హిట్ పడింది. అందులోనూ పండుగ సీజన్ కావడంతో కాసుల వర్షం కూడా బాగానే కురిసింది. ఇప్పుడు ఆయన భోళా శంకర్ సినిమాతో రావడానికి రెడీ అవుతున్నాయి. ఇది 2015లో విడుదలైన తమిళ చిత్రం వేదాళం మూవీకి రీమేక్. ఈ చిత్రానికి మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది ఆగస్ట్ 11న విడుదల అవ్వడానికి రెడీగా ఉంది. నిజానికి మెగాస్టార్ సినిమా ఉంది అంటే ఆ దరిదాపుల్లో సినిమా విడుదల చేయడానికి ఇతర హీరోలు ఎవరూ డేర్ చేయరు. ముఖ్యంగా చిన్న హీరోలు ఆ ధైర్యం అస్సలు చేయరు. కానీ మెగాస్టార్ తో తలపడటానికి డిజే టిల్లు హీరో సిద్దు జొన్నలగడ్డ రెడీ అవుతున్నాడు. ఇటీవల డీజే టిల్లుతో హిట్ కొట్టి సెన్సేషన్ అయిన ఈ యువ హీరో. ఆ సినిమాలో సిద్ధు డైలాగులు కామెడీ టైమింగ్ కి యూత్ ఫిదా అయిపోయారు. కాగా ఇప్పుడు దానికి సీక్వెల్ గా టిల్లు స్క్వేర్ తెరకెక్కిస్తున్నాడు. ఆ సినిమా కూడా ఆగస్టు11నే విడుదల చేయాలని ఆ మూవీ టీమ్ భావిస్తోందట. అయితే మెగాస్టార్ తో పోటీ అవసరమా అని కొందరు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ తన సినిమా మీద ఉన్న నమ్మకంతో చిరుతో పోటీకి రెడీ అవుతున్నాడు. నిజం చెప్పాలంటే భోళా శంకర్ కన్నా టిల్లు స్క్వేర్ కే క్రేజ్ ఎక్కువగా ఉంది. మెగాస్టార్ స్టార్ డమ్ తప్ప భోళా శంకర్ కి పెద్దగా ప్లస్ పాయింట్స్ ఏమీ లేవు. వేదాళం మూవీ కూడా చాలా వరకు సినీ ప్రేక్షకులు చూసే ఉంటారు. కాబట్టి పెద్దగా క్రేజ్ లేదనే చెప్పాలి. కానీ టిల్లూ స్క్వేర్ అలా కాదు. దాని రీమేక్ కోసం ఫ్యాన్స్ తో సంబంధం లేకుండా పిల్లలు పెద్దలు అందరూ దానిని చూడటానికి ఎదురు చూస్తున్నారు. ఇక భోళా శంకర్ లో చిరంజీవి చెల్లిగా కీర్తి సురేష్ నటిస్తుంటే టిల్లూ లో అనుపమ పమేశ్వర్ హీరోయిన్ గా నటిస్తోంది. మరి ఈ బాక్సాఫీస్ క్లాష్ లో విజయం ఎవరికి దక్కుందో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.

## ఎంట్రీకి ముందే పర్ఫెక్ట్ ప్లాన్.. సంయుక్త స్కెచ్ అదుర్స్..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో సూపర్ ఫాం లో ఉంది. తన సినిమా ఎంట్రీ అంతా అలా జరిగిపోయిందని తన ఫేస్ బుక్ ఫోటోని చూసి ఒక డైరెక్టర్ కు ఒక కెమెరా మెన్ రిఫర్ చేయగా ఆడిషన్ కు పిలిచి సినిమా ఛాన్స్ ఇచ్చారని అన్నది. అంతేకాదు ఒక సినిమా చేసి సినిమాలు ఆపేద్దామనుకున్నా కానీ ఇక్కడ ప్రేక్షకుల ఆదరణ చూసి వరుసగా చేస్తూ వస్తున్నా అన్నది సం యుక్త. భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఆ సినిమా ఆఫర్ రాగానే ట్యూటర్ ని పెట్టుకుని మరీ తెలుగు నేర్చుకున్నానని అన్నది. భీమ్లా నాయక్ ఈవెంట్ లో తెలుగు లో మాట్లాడటం చూసిన పవన్ కళ్యాణ్ చాలా బాగా మాట్లాడారని చెప్పారు. ఇక భీమ్లా నాయక్



సినిమా తర్వాత తనని అందరు డ్యానియల్ భార్య అని పిలుస్తున్నారని. పవన్ కళ్యాణ్ సిస్టర్ అంటున్నారని చెప్పుకొచ్చింది. తనకు ట్రావెలింగ్ చాలా ఇష్టమని ఒక్కదాన్నే ఎక్కడికైనా వెళ్తుంటానని అన్నది. హిమాలయాలకు వెళ్లొచ్చానని చెప్పింది సంయుక్త. అమ్మ నాన్న చిన్నప్పుడే విడిపోవడం వల్ల తన మదర్ దగ్గరే తను పెరిగానని. అందుకే తన తండ్రి ఇంటి పేరు మీనన్ ను ఇక మీదట వాడకూడదని అనుకున్నానని అన్నారు. ఇక హీరోయిన్ గా సెటిల్ అవకపోతే ట్రావెలర్ గా కెరీర్ ఎంచుకునే దాన్ని అని చెప్పింది అమ్మడు. అంతేకాదు ట్రావెలింగ్ అంటే ఇష్టం ఉండటం వల్ల తన వీపు మీద ట్రావెలర్ అనే ట్యాటూ కూడా వేయించుకున్నా అన్నది. కాలేజ్ డేస్ లో ధనుష్ ఆడుకాలం సాంగ్ కు ఫ్రెండ్స్ తో కలిసి డ్యాన్స్ చేశా ఇప్పుడు అదే ధనుష్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నా ఇది నిజంగా తను ఊహించలేదని అని చెప్పారు సంయుక్త. తెలుగులో మంచి ఫాం లో ఉన్న అమ్మడు తన ప్రతి సినిమాతో హిట్ అందుకోవడంతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సంయుక్త ఉంటే సినిమా హిట్ అన్న క్రేజ్ రావడంతో ఆమెతో సినిమాకు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మరో రెండు సినిమాలకు సైన్ చేసిన సంయుక్త తన లక్కీ ఫాం కొనసాగిస్తుందని చెప్పొచ్చు. సంయుక్త ను తెలుగు తెరకు పరిచయం చేసిన సితార బ్యానర్ లోనే మరో సినిమా కూడా ఆమె చేస్తుందని తెలుస్తుంది.

## అనసూయ వెబ్ సీరీస్ ఒక్క అడుగైనా పడిందా..?

జబర్దస్త్ యాంకర్ అనసూయ ప్రముఖ దర్శకుడు క్రిష్ డైరెక్షన్ లో ఒక మెగా వెబ్ సీరీస్ ప్లాన్ చేశారని తెలిసిందే. జబర్దస్త్ చేస్తూనే అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చిన అను సినిమాల్లో బిజీ అవడం వల్ల జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేసింది. అయితే అనసూయ జబర్దస్త్ కు బై బై చెప్పడానికి వెనుక రీజన్ క్రిష్ తో చేసే వెబ్ సీరీస్ అని టాక్ వచ్చింది. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నవల ఆధారంగా ఈ వెబ్ సీరీస్ రాబోతుంది. వెబ్ సీరీస్ గురించి సోషల్ మీడియా లీకులు తప్ప అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ అయితే రాలేదు. ఈ వెబ్ సీరీస్ లో అనసూయ వేశ్య పాత్రలో నటించనుంది. సోషల్ మీడియా హడావిడే తప్ప ఈ వెబ్ సీరీస్ ఇప్పటివరకు సెట్స్ మీదకు వెళ్లింది లేదు. అనసూయ కూడా సినిమా ఆఫర్లు వస్తున్నాయి కదా అని రెగ్యులర్ గా వచ్చే జబర్దస్త్ పేమెంట్ ని వదిలేసుకుంది.



అనసూయతో క్రిష్ వెబ్ సీరీస్ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అనసూయ మాత్రం రంగస్థలం పుష్ప లాంటి సినిమాల్లో ప్రత్యేక పాత్రలో నటిస్తూ వస్తుంది. బుల్లితెర మీద హాట్ ఇమేజ్ తెచ్చుకున్న అనసూయ వేశ్య పాత్రలో నటిస్తుందని అనగానే ఆడియన్స్ లో ఆసక్తి మొదలైంది. ఈ వెబ్ సీరీస్ మొదలవ్వాలి అంటే పవన్ తో క్రిష్ చేస్తున్న వీరమల్లు సినిమా పూర్తి కావాలి. రెండేళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు పవన్ డేట్స్ అడ్జెస్ట్ అవకపోవడం తో ఇప్పటికీ పూర్తి కాలేదు. పవన్ దీనితో పాటుగా మిగతా సినిమాలు కూడా చేస్తుండటం వల్ల వీరమల్లు సినిమా ఇంకా పెండింగ్ ఉంది. క్రిష్ పవన్ సినిమా పూర్తి చేసి అది రిలీజ్ అయ్యాకనే అనసూయ వెబ్ సీరీస్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది. అప్పటివరకు అనసూయ ఎదురుచూడక తప్పదు. అనసూయ కన్యాశుల్కం వెబ్ సీరీస్ పై ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ ఏర్పడింది. ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ వెబ్ సీరీస్ ను ప్లాన్ చేస్తున్నారు. ఈ వెబ్ సీరీస్ కోసం అనసూయ భారీ రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది.



## ఇర్కోడ్‌లో మోడ్రన్ స్లాటర్ హౌస్‌ను ప్రారంభించిన మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు

సిద్దిపేట: మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ సిద్దిపేటలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభించారు. పట్టణ శివారు ఇర్కోడ్‌లో రూ.6 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మోడ్రన్ స్లాటర్ హౌస్‌ను, అందులో ఏర్పాటు చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా ఉత్పత్తులు, ఇర్కోడ్ నాన్‌వెజ్ పచ్చళ్లు, పంచాయతీరాజ్ శాఖ సేంద్రియ ఎరువుల స్టాళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, తదితతలు పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణంలో బీటీ, సీసీ రోడ్లకు, నర్సాపూర్ వద్ద గల కప్పలకుంట సుందరీకరణ పనులకు శకుస్థాపన చేశారు. ఆ తర్వాత నర్సాపూర్‌లో తాగునీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేశారు. స్వచ్ఛ బడిని సందర్శించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సిద్దిపేట జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నాగులబండ వద్ద నిర్మించిన ఐటీ టవర్‌ను ప్రారంభించారు.

## నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్




మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ జెండాను కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పార్టీ ఆఫీసులోకి ప్రవేశించారు. కార్యాలయంలో లోపల నిర్వహించిన అమ్మవారి పూజలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం నాగ్‌పూర్ జిల్లా అధ్యక్షుడు జ్ఞానేష్ వాకోడ్కర్‌ను కుర్చీలో కూర్చోబెట్టారు కేసీఆర్. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీలు కేశవరావు, సంతోష్ కుమార్, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దానం నాగేందర్, ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధుల, మహారాష్టకు చెందిన బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. నాగ్‌పూర్ పట్టణమంతా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, జెండాలతో నిండిపోయింది. ఎక్కడ చూసిన సీఎం కేసీఆర్ ముఖచిత్రంతో కూడిన 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. కాగా, పట్టణంలోని గాంధీబాగ్‌లో విశాలమైన స్థలంలో నిర్మించిన మహారాష్ట్ర బీఆర్ఎస్‌భవన్‌ను పార్టీ నాయకులు సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు.

## పాఠశాలల్లో 10 వేల రీడింగ్ కార్నర్లు.. ఈ నెల 20న ప్రారంభం: మంత్రి సబిత



వికారాబాద్: గ్రంథాలయ శాఖలో ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయాల్లో మెటీరియల్ అందుబాటులో ఉంచామని, డిమాండుకు అనుగుణంగా పస్తకాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు.

వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూనే నూతనంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిస్ట్రిక్ట్ లైబ్రరీలను నిర్మించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

చిన్నారులు, యువత, సీనియర్ సిటిజన్ల కోసం గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వేల రీడింగ్ కార్నర్లను ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20 విద్యా దినోత్సవం సందర్భంగా వాటిని ప్రారంభిస్తామన్నారు.

## వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశాననే ప్రచారం అవాస్తవం : డాక్టర్ శ్రీనివాస్ రావు



హైదరాబాద్ : వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు వస్తున్న వార్తలపై తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రావు గడల స్పందించారు. నా ఉద్యోగానికి నేను రిజైన్ చేయబోతున్నానని, వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నానని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం అని ఆయన స్పష్టం చేశారు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా తప్పకుండా మీకు తెలియజేస్తాను. కొత్తగూడెంలో ప్రజలకు సేవ చేయడానికి నా వంతు కృషి చేస్తున్నాను. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ నాకు ఇచ్చిన బాధ్యతలు నెరవేర్చడమే లక్ష్యంగా ప్రస్తుతం పనిచేస్తున్నాను అని డాక్టర్ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. అందరూ కోరుకుంటున్నట్టుగా కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశిస్తే తప్పకుండా ఆయన ఆదేశాలని పాటిస్తాను. అప్పటివరకు దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాను అని డాక్టర్ శ్రీనివాస్ రావు కోరారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ అగ్రగామి : స్పీకర్ పోచారం

బాన్సువాడ ( కామారెడ్డి) : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందని శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం అత్యధికంగా నిధులను మంజూరు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాన్సువాడ గ్రామీణ మండలం కొల్లూరు గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ పారిశుధ్య కార్మికులను సన్మానించి మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు గత ప్రభుత్వాలు గ్రామాలలో మౌలిక వసతుల కోసం రూ. 12,000 కోట్లు ఖర్చు చేస్తే తెలంగాణ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలలో రూ.58,000 కోట్లు ఖర్చుచేసిందని వెల్లడించారు. తాగునీటి కోసం రూ. 36,000 కోట్లు ఖర్చు చేసి ఇంటింటికి తాగునీరు అందిస్తుందని పేర్కొన్నారు.బ్రిడ్జిల నిర్మాణం రూ. 9,797 కోట్లు , సీసీ రోడ్లకు రూ. 2,310 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు.ప్రతి గ్రామానికి ట్రాక్టర్, నీళ్ల సరఫరా కోసం ట్యాంకర్ ఇచ్చామని ఆయన అన్నారు.పల్లె దవాఖానల ఏర్పాటుతో వైద్యాన్ని సీఎం కేసీఆర్ ప్రజల ముంగిట తీసుకొచ్చామని పేర్కొన్నారు.

ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పింఛన్లు అందిస్తున్నామని స్పీకర్ వివరించారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా నగదు సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని వెల్లడించారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. గుజరాత్ లో మాదిరిగా మోటార్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేస్తుండగా తెలంగాణలో కూడా మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం సూచిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్‌ఒప్పుకోలేదన్నారు. గొంతులో ప్రాణం ఉండగా ఒప్పుకోనని అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని స్పీకర్ గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి వస్తున్నాయని తెలిపారు. కొల్లూరు గ్రామంలో అదనపు తరగతి గదులను స్పీకర్ పోచారం ప్రారంభించారు. సిసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, నాగారం గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, ముదిరాజ్ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, బాన్సువాడ ఆర్డీవో రాజా గౌడ్, డీఎస్పీ జగన్నాథ రెడ్డి, మండలాధ్యక్షురాలు దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## ఇలాగైనా కలిసొస్తుందేమో- షర్మిల లోటస్ పాండ్ ఇంట్లో వాస్తు మార్పులు..!!

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. అధికార భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే జిల్లాల్లో సుడిగాలి పర్యటనలను నిర్వహిస్తోన్నారు. కలెక్టరేట్లు, పోలీస్ సూపరింటెండెంట్ ఆఫీస్‌లతో పాటు పార్టీ కార్యాలయాలనూ ప్రారంభిస్తోన్నారు. ఇక ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల కోసం కేసీఆర్ ఇప్పటి నుంచే సమాయాత్తమౌతోన్నారు. ఎక్కడికక్కడ వరాలను ప్రకటిస్తోన్నారు. అటు కాంగ్రెస్, భారతీయ జనత పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తెలంగాణలో పర్యటించారు. బహిరంగసభను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా ఆమె బాధ్యతలను సైతం వెనుకాడట్లేదు. బీజేపీ తరఫున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 15వ తేదీన తెలంగాణలో పర్యటించాల్సి ఉన్నప్పటికీ.. అది రద్దయింది. ఇక వైఎస్ షర్మిల సారథ్యంలోని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పరిస్థితి ఆశాజనకంగా ఏమీ ఉండట్లేదు. అన్ని పార్టీలు వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో ఉంటోండగా.. దీనికి భిన్నంగా వైఎస్ఆర్టీపీలో కొంత స్తబ్దత ఏర్పడింది. గతంలో ప్రజా ప్రస్థానం పేరుతో రాష్ట్రంలో 3,800 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగించారు షర్మిల. క్షేత్రస్థాయిలో సమస్యలో ప్రజలు ఎదుర్కొంటోన్న సమస్యలు, స్థానిక రాజకీయాలపై అవగాహన ఏర్పరచుకున్నారు. దీనికి అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకునేలో పనిలో నిమగ్నం అయ్యారామె. మేనిఫెస్టో రూపకల్పనపై షర్మిల ప్రస్తుతం కసరత్తు చేస్తోన్నారని తెలుస్తోంది. వచ్చే నెల రెండో వారంలో ఆమె మరో విడత జనంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ వెలువడేంత వరకూ జనంలో ఉండేలా వ్యూహాలను సిద్ధం చేసుకుంటోన్నట్లు చెబుతున్నారు. కాగా- తాజాగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని నివాసంలో భారీగా మార్పులు చేర్పులకు షర్మిల పూనుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వాస్తు శాస్త్రానికి అనుగుణంగా ఈ మార్పులు చేస్తోన్నారు. పార్టీని విస్తరించే క్రమంలో చేస్తోన్న శ్రమకు, అదృష్టం కూడా కలిసి రావాల్సి ఉంటుందని భావిస్తోన్న షర్మిల- పార్టీ కార్యాలయాన్ని వాస్తుకు అనుకూలంగా మార్చితే బాగుంటుందని భావించారు. వాస్తు నిపుణుల సూచనల మేరకు మార్పులు చేపట్టారు.

## లిఖిత మృతిపై పూర్తి సమాచారం వచ్చాక మాట్లాడతా: సబితా ఇంద్రారెడ్డి



వికారాబాద్: బాసర ఆర్జీయూకేటీలో నాలుగో అంతస్తు నుంచి కిందపడి విద్యార్థిని చనిపోవడంపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. బాసర ట్రిపుల్ ఐటీలో వరుస ఘటనలు ఎంతో బాధిస్తున్నాయన్నారు. రెండురోజులు క్రితం పీయూసీ మెదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దీపిక మూత్రశాలలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కమిటీ వేశామని.. విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇవాళ జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు రాలేదన్నారు. విద్యార్థిని లిఖిత మరణంపై పూర్తి సమాచారం వచ్చాక మీడియా సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలను వెల్లడిస్తామన్నారు. పరిస్థితులు ఏవైనా సరే విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దని మంత్రి సూచించారు.

## 'ఎమ్మెల్యేలు వ్యాపారాలు చేయొద్దని రాజ్యాంగంలో ఉందా?'



హైదరాబాద్: భారాస ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. నగరంలోని వారి కార్యాలయాల్లో ఆదాయపు పన్ను చెల్లింపు, వ్యయాలకు సంబంధించిన పత్రాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. సోదాలపై మర్రి జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ.."నిన్నటి నుంచి సోదాలు చేస్తున్నారు. నా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఐటీ అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నాం. ఎమ్మెల్యేలు వ్యాపారం చేయొద్దని రాజ్యాంగంలో ఉందా?వ్యాపారానికి తగిన పన్ను సక్రమంగా చెల్లిస్తున్నాం. ఇప్పటివరకు దాదాపు రూ.200 కోట్లు పన్ను కట్టాం. సోదాలు చేస్తున్న ఐటీ అధికారులే తిరిగి నాకు క్లీన్‌చిట్ ఇచ్చి వెళ్లారు" అని పేర్కొన్నారు.




పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ భద్రతలో భారీ వైఫల్యం చోటుచేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. సీఎం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో.. కొందరు వ్యక్తులు బైక్‌పై ఆయనకు అత్యంత సమీపానికి వచ్చారు. ముఖ్యమంత్రి భద్రతా వలయాన్ని ఛేదించుకుని దాదాపు ఆయనను ఢీకొట్టినంత పనిచేశారు. అప్రమత్తమైన నీతీశ్ వెంటనే ఫుట్‌పాత్‌పైకి దూకారు. గురువారం ఉదయం సీఎం మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఉదయం ముఖ్యమంత్రి నీతీశ్ వాకింగ్ చేసేందుకు తన ఇంటి నుంచి సర్క్యులర్ రోడ్డుకు వెళ్లారు. దీంతో ఆ మార్గంలో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. అయితే, ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు రెండు బైక్‌లపై ఆ మార్గంలోకి వచ్చారు. భద్రత వలయాన్ని దాటుకుని సీఎం నడుస్తున్న వైపు వేగంగా దూసుకొచ్చారు. వీరిని గమనించిన నీతీశ్ వెంటనే అప్రమత్తమై రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌పైకి దూకారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే భద్రతా సిబ్బంది బైకర్లను వెంబడించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనాస్థలంలో సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇది పొరబాటున జరిగిందా లేదా దీని వెనుక ఇంకేదైనా ఉద్దేశం ఉందా?అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ఎస్ఎస్‌జీ కమాండెంట్, పట్నా ఎస్ఎస్పీని నీతీశ్ తన ఇంటికి పిలిపించి సమావేశమయ్యారు. ఘటన జరిగిన సర్క్యులర్ రోడ్డులో మాజీ సీఎం రబ్రీ దేవి సహా పలువురు రాజకీయ నాయకుల నివాసాలున్నాయి.

## పల్లెప్రగతితో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం : మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ : తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన కార్యక్రమాలతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయి గూడెంలో పల్లె ప్రగతి దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గ్రామాలపై పట్టు ఉండడంతో వాటి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రగతికి పల్లెలు పట్టుగొమ్మలుగా ఉంటాయని భావించి ఆ దిశగా ఊరూరా పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పరిశుభ్రత, స్వచ్ఛతే లక్ష్యంగా దశలవారీగా పల్లెప్రగతిని చేపట్టడంతో పట్టణాల్లో ఉన్న సౌకర్యాలు పల్లెల్లో కనిపిస్తున్నాయని అన్నారు. ప్రకృతి వనాలతో పల్లెలన్నీ పచ్చందాలతో కనువిందు చేస్తున్నాయని అన్నారు. ట్రాక్టర్లు, ట్రాలీలతో ఇంటింటికీ చెత్త సేకరణ, గ్రామానికో వైకుంఠధామం9, డంపింగ్ యార్డు , నర్సరీల ఏర్పాటు, నిరంతరం మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయని అన్నారు. పల్లె ప్రగతి కింద ఇప్పటి వరకు తెలంగాణలో 13,528 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,745 గ్రామపంచాయతీల్లో 1329.73 కోట్ల ఖర్చుతో వైకుంఠధామాలు నిర్మించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక, ఐటీడీఏ పీవో అంకిత్, ట్రైనీ కలెక్టర్ పింకేష్, సర్పంచ్ భారతి, ఎంపీపీ విజయ, జడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ సదయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com